# బాల వికాసం

బాల గేయం



## ఫలాలు!

నిమ్మా-దానిమ్మా
అజీర్తినే అణగించు!
వికారాలనే కలిగించే
వివిధ వాంతులను తొలగించు!.

మధుర రసాల మామిడి
ఏ విటమిన్ల 'కావడి'
పొందికైనా ప్రొటీన్లకూ
పోషక విలువల 'చావడి'!.

జామా-కమలాఫలాలు
విటమిన్ 'సి'కి నిలయాలు!
బత్తాయి-బొప్పాయి
ఆరోగ్యానికి మేలోయి!.

మండుటెండలో తరువోస
మన దాహార్తిని తీర్చేను!
ఖర్జూరా-ఖర్బూజా-ద్రాక్ష
కమ్మగ శక్తిని కూర్చేను!.

'సపోటా'- సీతాఫలం
తింటే కలుగును ఎంతో బలం!
కాని 'కొలస్ట్రాల్' పెంచేను
మితమే హితమనిపించేను!.

ఆయా ఋతువుల
అందే ఫలాలు
అందరు ఆరగించాలి!
ఆరోగ్యం సాధించాలి!.

బాదం-వాల్‌నట్స్
మొదలగు "డ్రై ఫ్రూట్స్"
ఆరోగ్యం కలిగించేను
ఆనందంగా వుండేను



– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## సీతాకోక చిలుక



రంగు, రంగుల చిలుక
రమ్యమైన చిలుక
సీతాకోక చిలుక
మా పెరటికి వచ్చింది
పూదోటలో తిరిగింది
పూలపై వాలింది
మకరందం తాగింది
తన వెంట తిప్పింది
ముచ్చటలే చెప్పింది
కనువిందు చేసింది
పట్టుకుందామంటే
తుర్రుమని ఎగిరింది

## అందమైన బాతు

అందమైన బాతు ఒకటి
ఆటలాడు కుందామని
ఒంటరిగా ఉన్న నన్ను
జట్టు కట్టమన్నది
వీపుపై ఎక్కించుకొని
కొలను చూపుతానన్నది
ఈత నాకు నేర్పిస్తే
చెలిమి చేస్తాననగా
ఆనందంతో ఎగిరి గెంతేసి
అక్కున చేర్చుకున్నది
కొలను అంతా తిప్పగా
ఈత నాకు నేర్పగా
కేరింతలు కొడుతూ
ఇద్దరం ఆటలాడుకున్నాము



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
77080277240

## సర్వం గురుమయం

అమ్మేగా ఆదిగురువు
ఆత్మీయత పంచగా,
నాన్నేగా జ్ఞానమూర్తి
నడవడిక ను నేర్పగ..

కుటుంబమే పాఠశాల
తొలుత నడత తెలుపగ,
అనుబంధపు ఆనవాళ్ళ
మధుర రుచిని చూపగ..

మిత్రులే మనకు ఆచార్యులు
మంచి చెడుల వివరించ,
సహచరులే గురుతుల్యులు
సమజీవన సారమెంచ..

పండుటాకుల అనుభవాలే
నవజీవన వేదాలు,
వాడకట్టు వాడుకలే
సత్య జ్ఞాన వేదికలు..

సమాజమే పాఠశాల
సహగమనమే గ్రంథం
మంచి చెడుల జాడదెలిపే
మనుషులే కద సహజ గురువులు..

జీవన ప్రతీ పథము గతిని
ఎరుకపరిచి,వివరించే..,
మనిషే కదా గురువు..
మార్గదర్శనమే చదువు..



-మధుకర్ రావు బోగెల్లి
9491318502

## బొడ్డెమ్మ

వేకువజామున లేచాము
ఇంటిని శుద్దిగా చేశాము
తట్టా బుట్టలు పట్టాము
పరుగున పుట్టా చేరాము
నాగమ్మకు దండమెట్టాము
తట్టలో మట్టిని నింపాము
ఇంటికి పరుగులు తీశాము
పీటను శుభ్రపరిచాము
మట్టితో బొడ్డెమ్మ చేశాము
పూలతో అలంకరించాము
బొడ్డెమ్మ కోలో పాడాము
ఐదురోజులు ఆడి మురిశాము
గంగమ్మ ఒడిలో చేర్చాము
బొడ్డెమ్మ దీవెనలు పొందాము



-ఉండ్రాళ్ళ రాజేశం
9966946084

## బడిపంతులు

బతుకలేని బడిపంతులని
జనుల నోళ్ళలో నానిన నాటి తరం నుండి
బతుకు బండి లాగుతూ
బతకడం ఎట్లాగో తెల్పినవాడు.
బతుకు పట్ల భరోసా కల్పించి
భుజాలకెత్తుకున్న బాధ్యత పట్ల
నిబద్ధతకు నిలువుటద్దమై నిలిచినవాడు.
మారుతున్న విలువల్లోను
మానవీయతకు దర్పణంగా వెలుగుతున్న మార్గదర్శి.
మార్పులెన్ని వస్తేనేమి
మనిషిని సవ్యదిశలో నడిపించే తీర్పరికి
ప్రత్యామ్నాయం పర్యాయపదం అతడే.

సంక్షోభం లోనైనా సంధికాలం లోనైనా
సవాళ్ళను అధిగమించే నేర్పును
పురిగొల్పు ఓర్పుకు ప్రతిబింబం అతడు.
చరిత్ర ప్రతి మలుపులో చెరగని సంతకమై నిలిచిన
గురుతర ప్రస్థానం గురువుది.
అక్షరాలు దిద్దుకొన్న ప్రతి ఎదలో మెదిలే అగ్ని కణం
అజ్ఞానానికి
చురకలు బెడుతూ నిద్రాణమైన ఎరుకను మెరిసేలా
నింగికెగిసేలా చేయగల నిష్ఠాగరిష్ఠి.
కుటిల నటనము గల
కుళ్ళిన సంఘంలోను
తెల్లని మల్లెలా వికసించాలని తపన పడే
నిరంతర ఆరాటం అతనిది
హంసా క్షీర న్యాయము లా
అవలక్షణాలను వెలికితీసి
నిఖార్సైన మనిషితత్వాన్ని నిలబెట్టగల
చతుర వచోనిధి.
జలగలా పట్టిపీడించే మౌఢ్యాల
జాడ్యాల బూజు వదిలించే సమాజ హితవరి
గతుకుల బతుకుల వెతల కన్నీటి జడులకు
కారణాన్వేషియైన కరుణశీలి.
ఆమని దరి చేరని వ్యధాభరిత జీవితాల
అంతరంగాల ఆవిష్కర్త
పుస్తకాన్ని మస్తిష్కం లో కుదించి
అక్షర లక్షలు లక్షణంగా సమకూర్చగల శిక్షకుడు.
అయినా
అంతులేని వేదన
అతడు అందరికి అవసరమైన వాడే
వాడి వత్తలై విసిరివేయబడిన
పూల రేకుల్లా గతి దప్పుతున్న
జీవితంలో
జ్ఞాపకాలే ఊపిరిగా కొనసాగే పయనం.
అవినీతి బురద కూపం లో కూరుకున్న
కుక్కమూతి పిందెల
వెక్కిరింపుల్లో కుదేలవుతున్న ఔన్నత్యం.
కొంత స్వయంకృతం ఉన్నా
విలువలు పతనమవుతున్న ప్రస్తుత సమాజ స్థితిలో
బతుకుపూలు వికసింపజేయు
బాధ్యత బడిపంతులిదే.



-గన్ రెడ్డి ఆదిరెడ్డి
9494789731

# బాలవర్ధన్

ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల
( ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)

12

ప్రసిద్ధ బాలల రచయిత
డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన
ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక
కాల్పనిక నవల 'బాలవర్ధన్'.
ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

"మీదీ నాదీ ఒకటే కథలా ఉంది" అన్నాడు గిరి, బాలవర్ధన్ చెప్పిన విషయాలు విన్నతరువాత. "మరిప్పుడు ఏంచేయాలనుకుంటున్నావు వర్ధన్ బాబు?" అని ప్రశ్నించాడు వెంటనే.

"రేపు ఆ గ్రామాల వైపు తీసుకెల్తావా గిరీ! అక్కడికి గానీ మానాన్న వెళ్ళాడేమో! ఆయనతో మాట్లాడిన వాళ్ళెవరైనా అక్కడ ఉన్నారేమో!" బాలవర్ధన్ గొంతులో మిగిలి ఉన్న చిన్న చిట్టచివరి ఆశ!

"తీసుకెల్తాను. కానీ ఏమీ ఫలితం ఉండదని చెప్పగలను వర్ధన్‌బాబూ! పదహారేళ్ల కిందటి సంగతి అది. ఎవరు గుర్తుపెట్టుకుంటారు? అసలు మీనాన్న అక్కడికి వెళ్లాడని చెప్పడానికి కూడా ఏ ఆధారమూ మీదగ్గర లేదు. అక్కడ కూడా మీకు ఏమీ తెలియదని నేను ఖచ్చితంగా చెప్పగలను."

గిరి మాటలు వాళ్ళకు తీవ్రమైన నిరాశను కలిగించాయి. విచారంగా శూన్యంలోకి చూస్తున్నట్టు ఉండిపోయాడు బాలవర్ధన్...కొన్ని క్షణాల తరువాత గిరి నిదానంగా అన్నాడు. "కానీ వర్ధన్ బాబూ! మీరు అంగీకరిస్తే, మీ అమ్మానాన్నల దగ్గరికి చేరే మార్గం నేను చూపించగలను! అదీ నన్ను మీరు పూర్తిగా నమ్మితే! ఏప్రశ్నలూ అడగకుండా నా వెంట వస్తే, ఈరోజే ఇప్పుడే నేను తీసుకెళ్ళగలను."

అగాధమైన జలపాతంలో పడి కొట్టుకొనిపోతున్న వాళ్ళను హెలిక్యాప్టర్‌లో వాళ్ళెవరో తాళ్ళ నిచ్చెనలు వేసి రక్షించడానికి వచ్చినట్టు!...ఊహించని విధంగా గిరి నోటినుంచి వచ్చిన ఆ మాటలు వాళ్ళ ఆశలకు అమృతం ప్రాణం పోశాయ్!...నమ్మలేనట్టు, ఆశ్చర్యంగా నిశ్చేష్టులై అలా సంభ్రమంగా చూశారు...కొద్దిసేపు

వాళ్ళనడుమ కాలం ఆగిపోయినట్టు ప్రగాఢమైన నిశ్శబ్దం...

"ఔనా!...నిజంగానా?!...గిరీ!?" రాము ప్రశ్నలో, బాలవర్ధన్ చూపులో ఇంకా నమ్మలేనితనం.

"ఔను. నిజమే! మీరు ఇక్కడికి వస్తారని నాకు ముందే తెలుసు."

"ముందే తెలుసా?! ఎలా??" ఇదంతా వాళ్ళకు అయోమయంగా ఉంది.

"అది మీకు తరువాత చెప్తాను. మీరు మీ వాళ్ళను వెతుక్కుంటూ ఇక్కడికి వస్తారని తెలిసే నేను మిమ్మల్ని కలవడానికే, మీ కోసమే ఇక్కడికి వచ్చాను. ఆ వివరాలు ఇప్పుడు నేను చెప్పకూడదు."

"సరే, మమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళు" బాలవర్ధన్ వెంటనే తన అగీకారాన్ని తెలియజేస్తూ సిద్ధమైపోయాడు గిరితో వెళ్ళడానికి. రాము ఏమీ మాట్లాడకుండా అలా చూస్తూ నిలబడ్డాడు.

"పోదాం బాలవర్ధన్ బాబూ! కానీ కష్టాలతో, అపాయాలతో కూడుకొన్న ప్రయత్నం అది. తిరిగి ప్రాణాలతో బయట పడగలరో లేదో తెలియదు. కానీ మీకు ఆ ధైర్యాన్నీ, సంతోషాన్నీ ఇచ్చే విషయం చెప్తాను. మీ అమ్మా నాన్నా ఇంకా ప్రాణాలతోనే ఉన్నారు, బతికే ఉన్నారు!"

నెత్తిన అమృతం పోసినట్టనిపించింది వాళ్ళకు. బాలవర్ధన్ సంతోషంతో ఉక్కిరి బిక్కిరై ఆ ఉద్వేగాన్ని తట్టుకోలేక పోతున్నాడు. "థ్యాంక్స్ గిరీ! నీకు ఎలా కృజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు! నాకు ప్రత్యక్షమైన దేవుడిలా, ఆత్మ బంధువులా కనిపిస్తున్నావు." అంటూ ఆనందం పట్టలేక గిరిని గట్టిగా కౌగలించుకున్నాడు. రాము కూడా గిరి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

"ఎవరో పర్యాటకులు వస్తున్నారు. ఇక మనం బయలుదేరుదాం పదండి! మనం మరోవైపుకు వెళ్లాలి, అడవి లోపలికి" అంటూ కదిలాడు గిరి. వాళ్ళిద్దరు అతణ్ణి అనుసరించారు. అలా కొంతదూరం వచ్చిన బాటలోనే నడిచిన తరువాత కుడి వైపుకు తిరిగి, చెట్ల మధ్యలోంచి ఇంకా అడవి లోపలికి దారి తీశాడు గిరి. అతని వెంటనే వాళ్ళూ నడుస్తున్నారు. అటువైపు దారేదీ లేదు. చెట్లనూ, పొదలనూ దాటుకుంటూ ఆ అరణ్య గర్భం లోనికి, ఇంకా ఇంకా లోపలికి తీసుకొని పోతున్నాడు గిరి. అలా నడవడం చాలా కష్టంగా ఉంది.



వాళ్ళచుట్టూ వున్న అడవి ఎంత అందంగా ఉన్నా, అదిప్పుడు వాళ్ళకు ఓ మార్మిక ప్రపంచంలోకి పోతున్నట్టే ఉంది. కొండలమీద ఎక్కడో పుట్టిన సెలయేరు ఒక చోట పక్కన లోయలో గలగలా పారుతూ కనిపించింది. దట్టంగా పెరిగిన చెట్లు సూర్యరశ్మిని కూడా నేలమీదికి




రానీయకుండా అడ్డుకుంటున్నాయి. పక్షుల కూతలూ, కీటకాల శబ్దాలూ, చెట్లమీద సంచరిస్తున్న కొండెంగలూ కనిపిస్తున్నాయి. ఎత్తుగా పెరిగిన ముళ్ళపొదలు, చెట్ల కాండాలకూ, కొమ్మలకూ చుట్టుకొని వేలాడుతున్న ఏవేవో తీగలూ ...అలా వాళ్లు నడుస్తూనే ఉన్నారు. కొండను ఎక్కుతూ, వాలుల్లోకి దిగుతూ, సన్నటి కనుమల్లోంచి నడుస్తూ వాళ్ళు ఓ చోటికి చేరారు. ఓ ఎత్తయిన కొండ వాలున నిలబడ్డారు. వాళ్లకు రెండడుగుల పక్కనే చెట్లు, పొదలతో నేల కనిపించకుండా ఉన్న లోతైన లోయ కనిపించింది. అక్కడ గాలి చప్పుడుకూడా లేనంత నిశ్శబ్దంగా ఉండటాన్ని గమనించారు వాళు.

జాగ్రత్తగా రండి. అంటూ ఆ ముళ్ళ పొదలను తప్పించుకుంటూ, చెట్ల వెనుకవున్న పెద్దపెద్ద రాళ్ళవైపు నడిచాడు గిరి. ఆ రాళ్ళల్లోంచి నడుస్తుండగా ఓచోట వాళ్ళకు ఆ రాళ్ళ మధ్యలో ఓ సన్నగావున్న ఓ ఇరుకైన సందు కనిపించింది.

ఆ సందులోంచి దూరి పోతే సొరంగం లాంటిది కనిపించిది. దాన్ని కప్పేసినట్టు పొదలు పెరిగి ఉన్నాయి. లోపల కొంతదూరం ఇరుగ్గా వంకర టింకరగా, వంగి వంగి అడ్డంగా నడుస్తూ కొంతదూరం పోయిన తరువాత, వాళ్ళకు విశాలంగా ఉన్న గుహ ఒకటి కనిపించింది. వెలుగు సరిగా ప్రసరించకుండా మసక మసకగా ఉందక్కడ. అక్కడ్నుంచి ముందుకు వెళ్లడానికి ఇక ఏమాత్రం అవకాశం లేనట్టుంది. ఎంతో ధైర్యవంతుడైన రాముకు కూడా లోపలి నుంచి చిన్నగా భయం మొదలైంది. బాలవర్ధన్ మాత్రం గిరిని పూర్తిగా నమ్మి నిలబడ్డాడు.

"గిరీ! ఏముందిక్కడ?" అని అడిగాడు.

"ఒక్క నిమిషం!" అంటూ, గిరి తన బ్యాగులోంచి ఓ చిన్న ప్లేట్ లాంటి దాన్ని తీశాడు. ఒక చిన్న టీసాసర్ లా ఉందది. దాని లోపలి వైపు సన్నటి గీతలు ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లా కనబడుతున్నాయ్. దాన్ని అక్కడ గుహ మధ్యన, నేలమీద సమతలంగా ఉన్నచోట జాగ్రత్తగా పెట్టాడు. తరువాత ఓ రూపాయిబిళ్ల లాంటిదేదో తీసి, ఆ ప్లేట్ నడిభాగంలో వలయాకారంలో కనబడుతున్న సర్కిల్ మీద పెట్టాడు. తరువాత దాన్ని ఒత్తి పట్టుకుని కుడికైపు కొంచం గుండ్రగా తిప్పాడు. దానిలోంచి సన్నటి ఆకుపచ్చటి కాంతి రావడం మొదలైంది. వెంటనే దానికి దూరంగా జరిగి నిలబడ్డాడు. వాళ్ళు చూస్తున్నంతలోనే ఆ ప్లేట్ ఓపువ్వు విచ్చుకుంటున్నట్టుగా విచ్చుకుంటూ పెరిగిపోయింది. సుమారు ఓ పన్నెండు అడుగుల వైశాల్యంతో గుండ్రగా ఏవేవో సర్క్యూట్లలాంటి గీతలతో లేత ఆకుపచ్చటి కాంతితో కనిపిస్తున్నదది. ఆ విచిత్రాన్ని ఆశ్చర్యతో చూస్తున్నారు వాళ్ళు.

"రండి దానిమీదికి పోదాం" అంటూ వాళ్ళు ఏమీ ప్రశ్నించే అవకాశం ఇవ్వకుండా బాలవర్ధన్ చేయి పట్టుకొని దానిమీదికి నడిచాడు గిరి. "రామన్నా! ఆలస్యం చేయకు. వచ్చేయ్" అని రామును పిలిచాడు. సందేహిస్తూనే రాము కూడా వెళ్ళి దానిమీద నిలబడ్డాడు. వెంటనే దాని అంచుల వెంట ఏదో నల్లటి గోడ పెరిగినట్టుగా పెరిగి అదో అర్ధగోళంలా మారిపోయింది. మధ్యలో కూర్చోవడానికి వీలుండేలా మెత్తటి పెద్ద సోఫాలాంటిది ఏర్పడింది.

"కూర్చొని కళ్ళు మూసుకొండి!" చెప్పాడు గిరి. బాలవర్ధన్ వెంటనే దానిమీద కూర్చుని ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాడు. "కొంపదీసి వీడెవడైనా మాంత్రికుడా? మమ్మల్ని ఇక్కడ బలివ్వబోతున్నాడా?" అని అనుమానిస్తూనే కళ్ళు మూసుకున్నాడు రాము. బాలవర్ధన్ మాత్రం గిరిని ఏమాత్రం అనుమానించడం లేదు. కానీ, తమ ఊహకు అందనిది ఏదో జరగబోతున్నదని మాత్రం అర్థం చేసుకుంటున్నాడు.

"ఏం జరుగుతున్నట్టు అనిపించినా నేను తెరువుమని చెప్పేవరకు దయచేసి కళ్ళు తెరవకండి. మనం బయలు దేరుతున్నాం. రడీ..వన్...టూ..త్రీ." గిరి త్రీ అనగానే హఠాత్తుగా ఊహించనంత వేగంతో తాము కూర్చున్న దానితో సహా ఎక్కడికో విసిరివేయబడ్డట్టు...సర్రున జారిపోతున్నట్టు అనిపించింది వాళ్ళకు. కళ్ళు తెరవాలని అనుకున్నా తెరవలేని పరిస్థితి. ఏదో మైకం కమ్ముతున్నట్టు...స్పృహ కోల్పోతున్నట్టు....

(సశేషం..)



-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749

## మమతల దీపాలను వెలిగిద్దాం ??

భిన్న సంస్కృతుల నిలయం
విభిన్న మతాల,కులాల ఆలయం
ఐక్యత పుష్పాల నందనం
శ్రమైక జీవుల చందనం
జగతికి శాంతి కేతనం
కర్మభూమి,పుణ్యభూమి మన దేశం

ఉత్తరాన హిమగిరులు ,
తనువులోన సిరుల ఝరులు
వయ్యారంగా ఒంపులు తిరుగుతూ
కడలిలో కలిసిపోయే జీవనదులు
పుడమికి పచ్చని చీర కట్టిన
తరువులు, పచ్చని పైరులు
పసిపిల్లల బోసినవ్వులసాగరం
మన సుందర భారత దేశం

పీరీలు, రంగోలి, న్యూయర్ ఫెస్టివల్స్
సబ్బండ వర్గాలు సంబరంగా చేసుకున్నా
అప్పుడప్పుడు మతాల మధ్య
నిప్పుల కొలిమై రగిలినా
వ్యక్తుల మధ్య విషపు జ్వాలలు చెలరేగినా
నీటిలో బుడగలా, తాటాకు మంటలా
సర్రున చల్లారుతుంది
కరుణ తటాకంలో కరిగి పోతుంది

మతాల మధ్య చిచ్చు పెట్టే
ముష్కరమూకలను మట్టుపెడదాం
వైషమ్యాల అడ్డుగోడలను కూల్చేద్దాం
ఐక్యతా రాగాన్ని ఆలపిద్దాం
మమతల దీపాలను వెలిగిద్దాం .



– తాటిపాముల రమేష్
7981566031

## మనిషి తెలివిదెచ్చుకో..

మనిషి ఏంజేస్తడు
తోచిందల్లా విచ్చలవిడిగా తడుముకోకుండా
తలెత్తుకుని తనపని కానిచ్చేస్తడు
మంచినిడిసిపెట్టి చెడ్డతనంతో దోస్తిజేసి జబర్దస్తీగా
సమాజంలా చేసేవి దొంగపనులైనా వాడే ఓ దొరిక్కడ

పట్టపగ్గాల్లేవు వావివరసల్లేవు
వానరంనుంచొచ్చినోడుకదా వాడు చేసే పనులన్నీ
కల్లుదాగిన కోతిలెక్కనుంటవి

దోచుకునేటోడేరాబాయ్ పాలించే సత్తా గలిగినోడు
వాడికి జై గొట్టినోడేరా భయ్ బతుకనేర్సినోడు
దునియా యాడమార్తది

కోటలమీద కోటలగట్టి తరాలుతిన్న తరగనాస్తిని కూడబెట్టె
బడాకోర్ రాజ్యంలో బతుకుల ఎలుగొస్తదా

సదువుకున్నోడు సంకనాకి తిరగవట్టే
తిరుగుబాటు జేసే సత్తాలేదాయె
హక్కులైతే ఇచ్చిండ్రు
అమలుజేసెటోడెవరోమరి.
స్వాతంత్రమొచ్చి గిన్నేండ్లైతే
ఎవని పరిస్థితులు మారిందిలే
ఉండనీకే ఇండ్లకోసం సలాంలు గొట్టలే
ఎందుకురా ఎదగని బతుకు.
ఓటేసేపుడు వాడో రాజు
తరువాతెపుడు నిత్య బంటు
ప్రజాస్వామ్య దేశంలో
వంశపారంపర్య పాలనంట.
అంతేలే ఓటేసెటోనికి తెలివి రానంతవరకు
వానికి స్వాతంత్ర్యమెక్కడిది
ఆలోచన సిన్నగజేస్తే
ఇంతెగదా మరి

-సి. శేఖర్(సియస్సార్)
9010480557

## హంసపాదులే

అంతరంగ భావాలెన్నో
వ్యర్థంకాని ఊహలతో
పరుగు పందెం పెట్టుకొని
ధవళ వర్ణంపై రంగు రంగు
అక్షరాల సుమాలు జల్లుతూ
అనంత కాలంగా పరికిస్తూపయనిస్తూ
పాదచారులై పరిభ్రమిస్తున్నాయి.
అప్పుడప్పుడు పదములు
గతకాలపు సౌరభ మూలాలను
స్మరిస్తూ స్తుతిస్తూ
అలవోకుగా అల్లిన సరికొత్త
జలతారు జరీ అల్లికల దారాలు....
ముడిపడి ఎక్కడికక్కడ మరో రూపాలై
ఏదో రాగాలు పలుకుతూ
వెనక వెనకాలే తిరుగుతూ
వెన్నంటే వుంటూ వెక్కిరిస్తూ కొన్ని
వెన్ను తడుతూ మరికొన్ని
తరుముకొస్తున్నాయి.
అటుపక్క ఇటుపక్క
స్వార్థం వూడలు దిగిన వృక్షాల చాటున
పొంచివున్న తోడేళ్ల చూపులు
తట్టుకోలేక తడబడుతూ
నిస్తేజంగా నిలబడి ప్రశ్నిస్తున్నాయి.
వూరు పేరు లేని వాళ్లు
పెద్ద పేరిందలై పెత్తనం చలాయిస్తున్నా
అడిగే అలవాటు లేని
పచ్చిక బయళ్లు బీడు బారుతున్నాయి.
ఆషాడమేఘాలన్ని ఆర్తితో బయిలుదేరినా
వింత గాలులన్నీ
ఉరుముల మెరుపులతో
బెదిరించి చెల్లాచెదరు చేస్తున్నాయి
ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు
అడుగులన్నీ హంసపాదులే.

-లలితా భాస్కర దేవ్
9885552922

## నాన్న త్యాగం

నా జీవితానికి రూపం పోసి
నా ముఖంలో చిరునవ్వు జూసి,
మూసిముసిగా నవ్వి మురిసిపోయి నా నుదుటిన ముద్దాడి,
నా చెయ్యి పట్టుకొని నన్ను నడిపించి నన్ను నవ్వించి,
నా లేతపాదాలకి నొప్పి తెల్వకుండా నన్ను భుజాలపై మోసి,
ఎన్నో బరువులు, బాధ్యతలు,
బాధలున్న కానీ మా అందరి ముందు,
నీ పెదవిపై చిరునవ్వే మరి, మాకు కన్నుల వెలుగు,
పొద్దంతా భూతల్లి ఒడిలో చెమట చిందించి
అలసిపోయి కూడా,
మా బ్రతుకులకి బంగారు బాటకై నీ ఆరాటం,
నేను చేసిన ఆకతాయి అకృత్యాలకు
ఆగ్రాన్ని దిగమింగి, తలదువ్వి,
నాకు ఆయుష్ నిచ్చే గొప్ప ఆప్తుడవు నువ్వు,
ఎన్నో అవమానాలు, ఎన్నో అవరోధాలు మాకోసం భరించి,
మా భవిష్యత్తుకి పులపాన్పు వేసినావు అన్ని తెగించి,
నువ్వు చిందించే చెమట చుక్కలే
మా కంచములో నేడు అన్నం మెతుకులు,
కన్నా పొట్టకోసం నువ్వు కరిగి, వెలిగే క్రొవొత్తివి,
ఎన్ని జన్మలెత్తినా తీర్చలేము నీ ఋణం,
పితృరుణాప్రప్తి కలిగేనా,
ఎందుకంటే నువ్వు "ఘనుడవు
త్యాగధనుడవు "నాన్న ??



-పల్లె రాజు
9666207288

## మారకే ఓ మనసా...

మనసు మారిపోతోంది
మంచిగా ఆలోచించలేకపోతోంది
ప్రేమను పంచలేకపోతోంది.
ఎంతో ఇష్టమైన వాళ్లలో కూడా
తప్పులు వెతుకుతోంది
చీటికీమాటికీ చిరాకు పడుతోంది
అన్నీ నాకే అని ఆరాటపడుతోంది.
నేను అనే అహం పెరుగుతోంది
మనం అనే ఆలోచన మసకబారుతోంది
హృదయం సున్నితత్వం కోల్పోతోంది
గుండె బండ రాయిగా మారిపోతోంది.
నాలో ఎందుకీ మార్పు
ఐనవాళ్ళు కష్టాల్లో ఉన్నా
అయ్యో అని మనసు కరగడంలేదు.
ప్రేమ అనే ఎరువు కరువయ్యి
బందాలనే మొక్కలు ఎదగడం లేదు
అంతర్జాలమనే అంతర్జాతీయ
సాలెగూడులో మెదడు ఇరుక్కుపోయింది
మనిషి మనసు ఆ వలలో చిక్కుకుపోయింది.

బంధాలను దూరం చేసుకుంటూ
భేషజాల మాయాజాలంలో
బందీ అవుతోంది నా మనసు
ఓ మనసా మేలుకో

విడదీయలేని చిక్కుముడులు ఏర్పడకముందే
అనవర బంధనాలను తెంచుకో
మన అనుకునే బంధాలను పెంచుకో
నీది మంచి మనసేనని నిరూపించుకో



-దేవలపల్లి సునంద
8297744716

## నిత్య స్మరణీయులు



-దోరవేటి
సెల్:9866251679

రుక్మిణి

క్షత్రియ వంశమందునను గల్గిన కుండిన భీమసేను స
త్పుత్రి! యనంత సద్గుణపు పుణ్యపు రాశి! మనంబు దివ్యమౌ
క్షేత్రము జేసి నిత్యమును కృష్ణుని గొల్చినయట్టి దివ్య చా
రిత్రి! పతివ్రతామణీ! ధరిత్రిని నీసరివారు లేరులే!

ప్రేమించువాని జీవన
భామినిగా మారుటన్న భాగ్యయశముకున్
ప్రామాణికమౌ ద్వాపర
రామా! నీ మాన్యచరిత రమణీయముగా...

కులమును ప్రేమశస్త్రమున గూల్చిన నీకథ మెచ్చుకొంచునే
కలియుగమందు మానవులు కల్మషమానస మగ్నులయ్యి వ
త్సలను కులాంతరోద్వహ విధంబును మెచ్చక ప్రాణహానికై
పలుమరు ఘోరకృత్యముల పాల్పడుచుందురు చిత్రమే కదా!

సవతిపోరు జూపి సత్యను మించిన
పుణ్యచరితవన్న పొలుపు నింపు
కథలు వినుచు జనులు గౌరవమ్పొంగ
నతులొనర్తు రమ్మ నిరతమ్ము!

## రాత - గీత

### దారిద్ర్యం



నా దారిద్ర్యపు
రాచపుండుపై
క్యాపిటలిస్టులు ఎప్పుడూ
కారం చల్లుతూనే ఉన్నా
రాజకీయ రాబందులు
అప్పుడప్పుడు
పొడుచుకు తింటూనే ఉన్నా
ఐ.ఎం.ఎఫ్. అరువు టానిక్
అందిస్తూనే ఉన్నా
క్యాపిటలిస్టు వైద్యులు
కట్టుకడుతూనే ఉన్నా
దారిద్ర్యపు పుండు
డెబ్బది ఏళ్లుగా
పెరుగుతూనే ఉంది
కానీ తగ్గడం లేదు.

### అరాచకం



సమాజమనే
సరస్సులో
అల్పుల ఆగడాలే..
అలల అలజడులు.



రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి

# జీవిత సత్యాలు



-ఆరవేటి రాజకుమార్
9494939593

తొలకరి జల్లు
ఆనందము ధరణికి
సిరుల హరివిల్లు
రైతన్న మదికి

అమ్మ మనసు
ప్రేమకు ప్రతీక
నాన్న మనసు
త్యాగానికి ప్రతీక

గోరంత దీపము
వెలుగు పంచును
చిన్న సహాయము
జీవితం నిలుపును

దేశమాత హారంలో
విరిసేవు పుష్పమై
భరతమాత తిలకంలో
వెలుగు రుధిరవర్ణమై

భారత తోటలో
పుష్పం నీవు
దేశమాత మెడలో
రత్నహారం నీవు

అమ్మ పాలు త్రాగి
రొమ్మును దన్నకు
నాన్న ఎదపై పెరిగి
గుండెను పిండకు.

అమ్మ దైవము
ప్రతిరూపము ప్రేమకు
పూజింపుము నిత్యము.
ఆమెను కష్టబెట్టకు

ఆరాటం చెందకు
ఆశల జీవితములో
అన్యాయము చేయకు
నిత్య జీవనములో

ఆశల పల్లకిలో
సేదతీరే చిలకమ్మ.
ఊహల వలయంలో
చిక్కుకోకు నీవమ్మ.

తెలుగు పువ్వులు
చిట్టి బాలలు
రేపటి పౌరులు
ఉషోదయ శోభలు

తెలుగుతల్లి కాంతులు
భారతతోట పువ్వులు
పువ్వులోని నవ్వులు
ఆకాశ వెలుగులు

క్రాంతి దివ్వెలు
మేఘవర్ష చినుకులు
నింగి మెరుపులు
ఇంద్రధనసు రంగులు

అమ్మ అమృతము
ఆయువు పోయును
నాన్న కిరణము
మార్గము చూపును

శాంతము పెంచును
మనిషికి వివేకమును
క్రోధము త్రుంచును
జీవుడి బంధాలను

చీమ చిన్నదైన
ధీమా గొప్పది
కాలానికి తగిన
పొదుపు చేసుకుంటది

తెలుగు పూదోటలో
పదపుష్పాలు విరిసేను
ప్రపంచ సీమలో
సుగంధం గుభాళించేను

అమ్మప్రేమ తియ్యదనం
మధురంగా వుండును
అమ్మభాష కమ్మదనం
అమృతంలా వుండును

వసంత కోయిల
గానంబు తెలుగు
కవుల కవనాల
జిలుగులా వెలుగు

రవికిరణ శోభలా
తెలుగు వెలుగు
వెన్నెల వెల్లిలా
ఆనందం కలుగు

జాబిలి వెన్నెలకు
కలువ వికసించును
కవుల కావ్యాలకు
తెలుగుతోట మురిసెను

గెలుపు తపన
విజయం చేర్చును
మొగ్గగా త్రుంచినా
పుష్పం వికసించును

ఎడారి ఆశలు
ఎన్నడూ గెలువవు
అవి ఎండమావులు
గమ్యం చూపవు

భానుడి కిరణంలా
వుండాలి లక్ష్యాలు
ఉషోదయ వెలుగులా
చూపును బాటలు

లక్ష్యము చేరువరకు
నిరంతరం శ్రమించు
నిరుత్సాహ పడకు
విజయం సాధించు

లక్ష్యము చేరుటకు
తపించు నిత్యము
బెదరకు అటంకముకు
అగును విజయము

మనకై తపించే
దైవము అమ్మ
మమకారం పంచే
త్యాగము అమ్మ

ప్రేమకు రూపం
మమకార ప్రతిరూపము
దీవెనిచ్చు దీపం
పేగు బంధము

ఆశీస్సులనిచ్చు అమ్మ
ఉషోదయ దీపములా
ప్రేమ పంచునమ్మ
వెన్నెల జిలుగులా

గరళం మింగెను
ముక్కంటి శివుడు
కష్టాలు తట్టుకునేను
నాన్న దేవుడు

బిడ్డలకై వెలిగేటి
క్రాంతి దీపము
ఇంటికై తపించేటి
తండ్రి దైవము

ఆహ్లాదం పంచును
ఉదయ కిరణము
ఆరోగ్యం ఇచ్చును
సూర్య నమస్కారము

భానుడి కిరణము
తిమిరము తొలగును
జాబిలి కిరణము
ఆహ్లాదం పంచును

పిల్లల బోసినవ్వు
కన్నవారికి ఆనందం
పువ్వుల చిరునవ్వు
జగతికి సుగంధం

మంచి మాటలు
చెవిన ఎక్కవు
రోగులకు ఆహారము
రుచిని పుట్టించవు

చెప్పుడు మాటలు
చెరుపును మనిషిని
నీతి వాక్యాలు
పెంచును కీర్తిని

కోపము దహించును
బంధాలు దూరమగును
శాంతము రక్షించును
అనుబంధాలు పెంచును

నిశిరాజు చంద్రుడు
వెన్నెల పంచును
దివిరాజు సూర్యుడు
వెలుగు నిచ్చును

చైతన్య పరచును
కలము రచనలతో
రాజ్యము దక్కించును
ఖడ్గము యుద్ధముతో

పుడమి మురిసెను
చినుకు పడగనే
రైతు సంతోషించే
మొలక మొలవగనే

మట్టిలో పుట్టినా
మాణిక్యం మెరువును
బురదలో పుట్టినా
కమలం పరిమళించును

పిల్లల సుఖమంతా
నాన్న కష్టము
పిల్లల విజయమంతా
నాన్న ప్రోత్సాహము

కష్టము చెంతరాదు
మనసు మంచిదైన
నష్టము దరిచేరదు
మంచి చేసినా

కోటి దేవతలతో
సమానము అమ్మ
మీయొక్క ప్రవర్తనతో
పెట్టించకు చెమ్మ

ప్రేమను పంచు
జనులకు నిత్యము
స్వార్థము త్రుంచు
మంచియగు లోకము

బాల్యం మనిషికి
అద్భుత వరము
జీవిత పథానికి
సుస్వర గీతము

కనుల కొలనులో
కదిలే తరంగాలు
మనిషి మదిలో
కదిలే భావాలు

చిన్న విత్తు
చెట్టు అగును.
సూక్ష్మ విపత్తు
ఇక్కట్లు తెచ్చును

విత్తనం నాటిన
చెట్టుగా నీడనిచ్చును
పొదుపు చేసిన
భవిషత్తుకు ధైర్యమిచ్చును.

కష్టాలు తెచ్చును
కలసిరాని కాలము.
సుఖాలుకూడా ఇచ్చును
ధైర్యంగా మెలుగుము.

చదువు నేర్చినా
సంస్కార ఉండాలి
విద్యలో ఎదిగినా
వినయ ముండాలి.

జ్ఞానము పంచెడి
విజ్ఞాన జ్యోతి
బోధన చేసెడి
గురువే క్రాంతి.

అన్యాయం చేయక
న్యాయంగా సంపాదించు
ద్రోహం చేయక
నమ్మకంగా జీవించు.

పాపాయి నవ్వులు
మధువులా వుండును
కన్నవారి సంతోషాలు
ఆకాశానికితాకేను.

ఎదిగిన కొడుకు
ధైర్యం తండ్రికి
నీవెపుడు పెట్టించకు
కన్నీరు వారికి.

దైవమును పూజించే
మనసుగల నీకు
అమ్మను ప్రేమించే
గుణము మరువకు .

నీప్రగతికై ఆలోచించే
నాన్నను స్మరించు
ముల్లోకాలను జయించే
ధైర్యమే వరించు.

జ్ఞానసంపద మెత్తము
అందించిన గురువును
గౌరవించు నిత్యము
విద్యలు సిద్ధించును.

ఆకలితో అలమటించే
అనాథలను ఆదుకొనుము
ప్రేమతో ఆదరించే
గుణము పెంచుకొనుము.

ఆస్తులు వున్నను
అక్కరలేదు కరుణకు
ప్రేమ నీకున్నను
అదిచాలు సేవకు.

వేలెత్తి చూపించేలా
వుండకు నేస్తం
చేయెత్తి నమస్కరించేలా
జీవించు సమస్తం.

కృంగిపోకు ఓడితే
గెలుపుకై పోరాడు
బెదిరిపోడు భయపెడితే
పోరాడే వీరుడు.

వ్యక్తిత్వమే మనిషికి
తరగని సిరి
చివరకి మానవుడికి
మిగిలేది అదేమరి.

భాణము విడిచిన
వెనకకు రాదు
నోరు జారిన
తిరిగి రాదు.

పుత్రుల ప్రవర్తనచే
పితరులను కీర్తింతురు
చెడు అలవాట్లచే
అపకీర్తి తెత్తురు.

అరక చేతబట్టే
రైతు పండించుటకు
అన్నము పెట్టే
ఆకలి తీర్చుటకు.

నీతిని బోధించు
మంచిని పెంచుటకు
ఆచరించి చూపించు
ఇతరులు పాటించుటకు.

కాసులు నీకున్న
బంధువులే అందరు
సిరి లేకున్నా
నిన్నెవ్వరు చూడరు .

ఎత్తి చూపకు
పరుల తప్పులు
నీవు పడకు
నిందలపాలు.

గుణహీనుడు పుట్టిన
వంశము వినాశనము
కలుపుమొక్క వుండిన
పంట నాశనము.

వరుణుడి కరుణతో
ప్రకృతి శోభించే
ఉద్యానవనాలతో
పుడమి పరవశించే.

# తెలంగాణ 1969 ఉద్యమ తీవ్రతను చాటి చెప్పిన గ్రంథం!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ.. తెలంగాణకు రాలేదని 'నిజాం రాజ్య విమోచనోద్యమం' జరిగింది. రైతులు, ప్రజలు తిరుగుబాటు చేసిన ఘటనలు ప్రపంచాన్ని ఆకర్షించాయి! ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక.. ఉమ్మడి రాష్ట్రంలో.. తెలంగాణ ప్రాంతం అన్నింటా వివక్షకు గురై.. తెలంగాణ ప్రజలు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 1969 వో పెద్ద ఉద్యమం నడిపించారు. విద్యార్థులు, యువకులు, ప్రజలు పాల్గొని ఉద్యమానికి బాసటగా నిలిచారు. అయితే.. ఆనాటి ఉద్యమం సందర్భంగా జరిగిన ఘటనలు.. స్పందనలు.. సన్నివేశాలు.. భాషణలు.. ఏవీ రికార్డు అనుకున్నంత స్థాయిలో జరుగలేదు. కొన్నింటిని మాత్రమే ఆయా పత్రికల నుండి, వ్యక్తుల నుండి సేకరించి "జనని సాహితి" జనగామవారు "జనని" పేరుతో 1969లోనే ఒకే కవితా సంకలనాన్ని ప్రచురించారు.

ప్రముఖ కవులు కాళోజీ, పేర్వారం జగన్నాథం, ముకురాల రామారెడ్డివంటి వారితో పాటు ఇందుర్తి ప్రభాకర్, సంపత్‌కుమార్ తదితరులు రాసిన కవితలను 'రుద్రశ్రీ', 'వెన్నెల' సంకలనకర్తలుగా వ్యవహరించి "జనని" తెలంగాణ ఉద్యమ కవితా సంకలనాన్ని ప్రకటించారు.

1969 నాటి ఉద్యమ తీవ్రతను, ఆనాటి ప్రజల బలమైన ఆకాంక్షను, ఆనాడు రాసిన కవితల్ని ఏర్చి కూర్చి "జనని" సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ తెలంగాణ సాహిత్య నిర్మాణానికి దోహద పడేందుకు మళ్లీ వెలుగులోకి తేవడం ముదావహం.

తెలంగాణ సాహిత్య నిర్మాణానికి.. తెలంగాణ చరిత్ర నిర్మాణానికి ఉపకరించేలా తెలంగాణ సాహిత్య అకాడమీ "జనని" గ్రంథాన్ని మనకు అందించడం అభినందనీయం. రుద్రశ్రీ, వెన్నెలల సంపాదకత్వంలో వెలువడిన ఈ గ్రంథంలోని ప్రముఖులు ఆనాటి స్థితి గతులకు అద్దం పట్టినవి ఇప్పటికీ.. ఎప్పటికీ మన తెలంగాణ అస్తిత్వాన్ని, స్వాభిమానాన్ని చాటే విధంగా ఉన్నాయి.

ప్రజావాణి, నిర్వాకం, తెలంగాణ వేరైతే, పల్కు పల్కు




చిలుక పలుకు, ఓట్లు, షాట్లు, నిదానం, దండి ఉపాయం, ధర్మసాగర మెండిపోయెను, జైహింద్ జై తెలంగాణ, నలుబదైదు సంతకాల నటుడా! అల్పుల ఆధిపత్యం, కూళ చేతిలో తాళపు చెవులు, పూలూ-చెప్పులు, 'కలదు కలదు, అభినందనలు, శ్రీమతి గాంధీ చెప్పుతాంది, భారత రాజ్యాంగం, ఇప్పుడు తెలిసొచ్చింది, వంటి శీర్షికలతో తెలంగాణ ఉద్యమంలో వివిధ సందర్భాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు రాసిన గేయాలు ఈ గ్రంథంలో పొందుపరిచారు.

కాళోజీ రాసిన ఈ గేయాల్లో.. కవితల్లో.. జనం యొక్క ఆకాంక్షను బలంగా ప్రతిబింబింపజేశారు.

"అగ్ని" రాసిన వేరు వేరు, కవితలో మనసుల కలువని పొత్తు.. మన జాతికి ఘోర విపత్తు.. శాపం వంటి ఈ పొత్తు, శత్రువులకు కూడా వద్దంటూ రాసిన పంక్తులు అందరినీ ఆలోచింపజేసేలా కొలువుదీరాయి.

ప్రముఖ కవి పేర్వారం జగన్నాథంగారు రాసిన 'గుడినే మింగిన వానికి..?" కవితలో రంగు మార్చడం ఎవడిక్కావాలి? అంతరంగంలో మార్పురావాలని.. జిల్లేడు చెట్టు కొమ్మల్ని కోయడం కాదు.. సమూలంగా పెరికి వేయాలని ఆకాంక్షించారు.

'సమైక్యత కావలెనని కోరుతూ.." శీర్షికతో వెన్నెల రాసిన కవితలో.. పన్నెండేళ్ల బానిసత్వపు సంకెళ్ళు పటాపంచలు కాక తప్పదని.. తెలంగాణ తప్పక వస్తుందని పేర్కొన్నారు.

రుద్రశ్రీ రాసిన కవితల్లోనూ ఉద్యమానికి ఊపిరి పోసే విధంగా తమ భావాలను ప్రకటించారు. బాధ పడ్డ గుండియలో.. అమృతం చిలుకనున్నదని ఆకాంక్షించారు. కవి ఇందుర్తి ప్రభాకర్‌గారు రాసిన 'సహేంద్ర తక్షకాయ స్వాహ", కవితలో అన్నలు నుడివే సౌభ్రాతృత్వం.. నాలుకపైదే కాని.. నాభిలోది కాదని.. ఒకే జాతి. .ఒకే రాష్ట్రం రాజకీయ రంగులాట కొరకేనని తేల్చి చెప్పారు.దోబోచుల తూపుల కుడికంటికి సామ్యత కుదిరేదెక్కడ? అని ప్రశ్నించారు.

కవి ముకురాల రామారెడ్డిగారు "భువన ఘోష"ను అక్షరాల్లో బంధించారు. కవి పెరుమాండ్ల సుధాకర్‌గారు రాసిన 'సమన్వయగీతం పాడొద్దు!" కవితలో...ఆనాడు ఉద్యమంపై తెలంగాణ వాదంపై ఇతర ప్రముఖ కవులు వెలుబుచ్చిన భావాలకు.. ప్రశ్నలకు సమాధానంగా రాసిన ఇందలి పంక్తులు బాగున్నాయి.

కవి శీలం రాజేశంగారు రాసిన 'పిల్లికి ఎలుక సాక్షి" కవితలో ఉద్యమానికి ఊపిరి పోసేలీ తమ భావాలకు అక్షరాకృతినిచ్చారు. "శాస్యం" పేరుతో మరో కవితను కూడా రాశారు.

ఇంకా ఈ గ్రంథంలో కవి నీలా జంగయ్యగారు రాసిన "పగ నిలుచునా" కుమారి కలువకొలనుగారు రాసిన "ఎదిరిస్తాం" తెన్నేటి సుధాదేవిగారు రాసిన "ఆగని వెల్లువ", కవి సంపత్కుమార రాసిన "ఆవేశానికి అభ్యర్థన" పిట్టల రామస్వామి రాసిన "యిదేనోయి తెలంగాణ" అందె సత్యనారాయణగారు రాసిన 'కన్న కడుపైతేగా" కందుల జోసెఫ్‌గారు రాసిన "తెలంగాణ సాధిస్తాం" బాలాజీ గోగీకర్‌గారు రాసిన 'మేలుకో తెలంగాణ", శీర్షికలతో రాసిన రచనలు ఉన్నాయి.

1969 తెలంగాణ ఉద్యమ కాలం నాటి పరిస్థితులకు దృష్టిలో పెట్టుకుని ప్రముఖ కవులు వివిధ సందర్భాల్లో రాసిన కవితలకు చోటు కల్పించి వెలువరించిన "జనని" తెలంగాణ ఉద్యమ కవితా సంకలనాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీవారు భావి తరాలకు మన చరిత్ర, సాహిత్యాన్ని అందించడానికి చేసిన ప్రయత్నం ప్రశంసనీయం..

ప్రతి ఒక్కరు చదివి.. స్వాభిమాన దృక్పథాన్ని అలవర్చుకోవడానికి.. తెలంగాణ పట్ల శ్రద్ధాభక్తును పెంపొందించుకోవడానికి.. ఇందలి రచనల ద్వారా ప్రేరణ పొందడానికి.. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగడానికి ఉపయుక్తంగా ఉండే గ్రంథమిది!

ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణం
హైదరాబాద్-500 004
ఫోన్: 040-29703142



-దాస్యం సేనాధిపతి
సెల్: 9440526644

పుస్తక సమీక్షలు

# శతకసాహిత్యంలో విలక్షణమైన ముద్ర

12వ శతాబ్దంలో నే తెలుగు భాషలో శతకం ఆవిర్భవించింది. నాటి నుండి నేటి వరకు సాహిత్యంలో విశిష్టమైన స్థానం ఏర్పరుచుకుని వయోభేదం లేకుండా అందరినీ రంజింపజేస్తూ ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని సంతరించుకుని ప్రత్యేకతను చాటుకుంటున్నదని చెప్పుకోవచ్చు.

శతకములోని ప్రతి పద్యానికి చివరలో ఒక పదము గానీ చివరి పాదము గాని ప్రత్యేకంగా ఉండడం ఆనవాయితీ ఇది పద్య రచన చేసిన రచయిత యొక్క సంతకం లాంటిది దీనినే మకుటం అంటారు.

ఇతర సాహిత్య ప్రక్రియలన్నీ పండితులకు మాత్రమే పరిమితమైనా శతకసాహిత్యం మాత్రం సామాన్య ప్రజానీకంలో ఆదరణ పొందుతూ అలరిస్తుంది. ఉదాహరణలుగా వేమన , సుమతీ శతకాలు ఉపాధ్యాయులు విద్యార్థులే కాకుండా సామాన్యుల నోళ్ళల్లో శతకపద్యాలు వినిపిస్తూనే ఉంటాయి. నైతిక విలువలను నేటి సమాజం పాటిస్తుందంటే శతకపద్యాలు కూడా ఒక కారణమని చెప్పవచ్చు. అదే శతకసాహిత్యం యొక్క గొప్పదనం. పద్యాలద్వారా చెప్పదలచుకున్న విషయాన్ని సులభంగా అర్థమయ్యే విధంగా రచించి అందరి హృదయాలలో కవి అంతరంగాన్ని నాటవచ్చు. అదేకోవలో పద్య సాహిత్యం ద్వారా తను చెప్పదలుచుకున్న విషయాన్ని తేలికగా అందరికీ అర్థమయ్యే విధంగా రాసి సామాన్యుల హృదయాలలో స్థానం సంపాదించుకుని పద్యరచనలో తనదైన ప్రత్యేక ముద్ర వేసుకున్న కవి మహమ్మద్ షరీఫ్.

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు ప్రవృత్తి సాహిత్య సేవ( పద్య రచన) ఉపాధ్యాయుడు కావడం వల్ల విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా చక్కని పద్యాలను రచించి విద్యార్థులకు చేరువయ్యాడు. మొదట రచించిన శతకం "షరీఫు మాట!వెలుగుబాట !"108 ఆటవెలది పద్యాలతో

రాసిన మొదటి శతకం ఇది ఇందులోని పద్యాలన్నీ సామాజిక అంశాలతో నేటి సమాజానికి అద్దం పడతాయి.

**ఆ.వె,, ఉగ్గు పాలతోడ ఉర్దూను నేర్చితిన్**
**కవిని గాను నేను కైతలిడగ**
**తప్పులెంచకండి మెప్పైన కవులార!**
**విను షరీఫు మాట వెలుగు బాట (3 )**

తన మాతృ భాష ఉర్దూ అయినా తెలుగు భాషపై గల ప్రీతితో నేను పద్యాలు రాస్తున్నాను. నేను రాసేది కవిత్వమే కాదని అందులో తప్పులు ఎంచ వద్దని ఎంతో సవినయంగా చెప్పుకోవడం తోనే షరీఫ్ యొక్క సంస్కారం తెలుస్తుంది.




**మరలిరాదు వయసు మంచు కరుగురీతి**

**మంచి చెడ్డలెపుడు మరువబోకు**
**ఆశలెక్కువైన అడియాసతానురా!(6)**

కాలం చాలా విలువైనది జన్మలన్నింటిలో మానవ జన్మ ఉత్తమమైనది.

జీవితం చాలా చిన్నది. అత్యాశలకు పోకుండా మంచి చెడుల మధ్య విచక్షణతో మెలగాలని పై పద్యం లో తెలియజేశారు.

**"అన్నదమ్ములిల్లు ఆస్తిపాస్తులనుచు**
**భార్య పిల్లలంటు బ్రతుకు నరులు**
**ధనము మాయలోన దైవాన్ని మరచిరే?.....( 7)**

బంధాలు బంధుత్వాలు ఆస్తిపాస్తులు జీవితాంతం నాదంటేనాదని అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు కానీ అవన్నీ ఇచ్చిన భగవంతుడిని మాత్రం మర్చి పోతున్నారని వాపోతున్నాడు కవి.

**"విలువలేని విద్య వెతలనిచ్చు భువికి**
**బతుకుదెరువు కెట్లుబాటవేయు**
**నీతిలేని చదువు నిస్సారమే గదా !.......!(12 )**

ప్రస్తుత సమాజంలోని తల్లిదండ్రుల మనస్తత్వానికి అద్దంపడుతుంది పై పద్యం. ఎన్నో లక్షల రూపాయల ఖర్చుతో తమ పిల్లలను పెద్ద కార్పొరేటు పాఠశాలల్లో చదివిస్తారు. ర్యాంకుల కోసం పిల్లలను కష్టపెట్టి రాత్రి పగలు విశ్రాంతి లేకుండా చదువు చదువు అని చెప్తారు కానీ అలాంటి చదువుతో భవిష్యత్తులో వారి జీవితంలో ఎలాంటి పరిణామాలు ఎదుర్కోనున్నారో ఆలోచించరు. విద్యతోపాటు విలువలు కూడా నేర్పించడం చాలా అవసరం కదా!

**"రంగు రూపు జూచి భంగపాటౌదురు**
**మనసు నెరుగరేమి మనుషులెవరు**
**పై మెరుగులు జూచి భ్రమచెందెలోకులే?(14)**

లోకం తీరే ఇంత కదా , హంగు ఆర్భాటాలు చూసి ఎదుటి వ్యక్తికి ఇచ్చే గౌరవ మర్యాదలు ఎంతోకాలం నిలవవు మనసు తెలుసుకోకుండా పై పై మెరుగులు చూసి భ్రమ చెందుతారెందుకో ఈ లోకం అంటూ వేదనతో చెప్పారు.

"సిరులు కురియు గదర చెరువులు నిండిన
తాగు ,సాగు నీరు ధరణి కంత
అన్ని యిచ్చుచెరువె! అమ్మగా వెలుగొందు!.......(17)

చెరువులు నిండితే పంటలు పండి తిండి కి లోటుండదు సిరిసంపదలు కలుగుతాయి. అందుకే చెరువును అమ్మగా వర్ణించాడు కవి ఎంత అద్భుతమైన భావన !

అలాగే స్త్రీలపై జరిగే అఘాయిత్యాలు రోజురోజుకీ పెరుగుతూ మహిళలకు రక్షణ కరువైన నేపథ్యంలో సభ్య సమాజం తలదించుకునే విధంగా నేటి యువత తయారవుతున్నారు అందుకే ఎవరికివారే రక్షణగా నిలిచి ఆడది అబల కాదు సబల అని నిరూపించుకోవాలని ప్రేరణాత్మకమైన క్రింది పద్యం చూడండి.

**"అవని యందు పడతి అవమానమొందగా**
**స్త్రీల రక్షణంబు సేయుటెట్లు**
**అబల మారవలెను ఆదిశక్తి గనేడు!....(30)**

**"పరులపైన నిందపాడిగాదెప్పుడూ**
**ఒరులకీర్తినసలు ఓర్వలేక**
**పనికిమాలినట్టి పన్నాగమేగదా!.....(33)**

"ఎదుటి వారు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటే ఓర్వలేక వారిపై నిందలు మోపడం ఒక పనికిమాలిన పనే కదా అంటూ అలాంటి పని మంచిది కాదు అని తన పద్యంలో హితవు చెప్పాడు.

**"అమ్మ యనెడి మాట యవనిలో మధురము**
**అమ్మ పిలుపు జగతి కమ్మదనము**
**అమ్మలేని లోటు నిమ్మహితీర్చునా?.....(44)**

అమ్మ అని పలుకే ఒక అద్భుతం కదా! ఆ పిలుపు లోని కమ్మదనం ప్రపంచంలో మరే విషయంలోనైనా దొరకదు కదా భగవంతుడు అన్ని చోట్లా ఉండలేక అమ్మను సృష్టించాడు అంటారు. భగవంతుని స్వరూపమైన అమ్మ లేని లోటు సృష్టిలో మరేదీ తీర్చలేదు కదా!

**"తల్లిదండ్రులిరువులల్లారు ముద్దుగా**
**పెంచి పెద్ద జేయు; పిల్లలంత**
**వృద్ధి చెందినంక వృద్ధాశ్రమము జేర్చి !....(98)**

నవమాసాలు మోసి కనిపెంచిన పిల్లలు పెరిగి ప్రయోజకులు అయ్యాక కన్నవారిని వృద్ధాశ్రమంలో వదిలి రావడం ఎంత నీచత్వం అంటూ ఆందోళన చెందుతున్నారు కవి.

**"ఏది శాశ్వతమ్ము మేదిని యందున**
**ఆలుపిల్లలాస్తి నప్పులేవి?**
**శాశ్వతంగ" కీర్తి "చరితలో నిలుచురా!....( 102 )**

ఈ సృష్టిలో ఏది శాశ్వతం కాదు అది అందరికీ తెలిసిందే... శాశ్వతం గా చరిత్రలో మిగిలేది కీర్తి ప్రతిష్టలు అనేది నిత్యసత్యాలు కదా!

ఇలా" షరీఫ్ మాట! వెలుగు బాట !" శతకంలోని పద్యాలన్నీ సులభశైలిలో ఉండి నీతిని బోధిస్తాయి. నేటి సమాజం లోని లోటు పాట్లను చక్కని పద్యాలు గా మలచి ఆవిష్కరించాడు షరీఫ్. ఇలా భరతవీర శతకం,సుజనశతకం ,మరియు పద్యమంజూష (సమస్యా పూరణలు) అష్టావధానంలో భాగమైన ఇచ్చిన సమస్యలను చమత్కారాలతో నైపుణ్యంగా పూరించి వాటన్నింటినీ ఒకదగ్గర చేర్చి సంకలనంగా తీసుకొచ్చాడు. అవిరామంగా సాహిత్యం లో చేస్తున్న కృషికి షరీఫ్ కు శుభాభినందనలు.

ప్రతులకు: మహ్మద్ షరీఫ్
చరవాణి:98665 60527



-వాసరచెట్ల జయంతి
9985525355

# టెలికాం రంగం- ఒక తరం క్రితం

సెల్‌ఫోను మ్రోగుతోంది.

'వాట్సప్'లో అబ్బాయి జర్మనీ నుండి ఫోను చేస్తున్నాడు. నేనూ మా ఆవిడా అబ్బాయితో, కోడలితో, మనవరాళ్ళతో ఒకర్నొకరం చూసుకుంటూ తనివితీరా ఒక గంట మాట్లాడుకున్నాము.

నా జ్ఞాపకాలు 32 ఏళ్ళు వెనక్కి వెళ్ళాయి. ఎమ్సెట్ ఎంట్రన్సు పరీక్షలో అబ్బాయికి తగినంత 'రేంకు' రాలేదు.

వాడు బాగాచదివేవాడే! మనసుపెట్టి రాసేవాడే!!

అయినా- ఎక్కడో, ఏదో, చిన్నలోకం. ఫలితం ఎమ్సెట్ జూదంలో ఓటమి.

ఇది వాడికీ చెంపదెబ్బ అయితే, వాడికంటే తక్కువ 'రేంకు'లు వచ్చిన కొందరు వాడి సహాధ్యాయిలు ఏ కాలేజీలో జేరితే బావుంటుందో తర్జన భర్జనలు పడుతున్నారు. లెక్కలు కడుతున్నారు. కారణం. వాళ్ళు 'బిసి'లు 'ఎస్.సి'లు ఇది వాడికి గోడ దెబ్బ.

అబ్బాయి కృంగిపోయాడు. మాట్లాడడు. కదిలిస్తే చాలు. కన్నీరు కడవలవుతున్నది. వాడి బాధ గమనించి మాకూ బాధ కలుగుతోంది. వాడు మా కడుపున పుట్టకుండా ఉండాల్సింది. ఏ వెనుక బడిన కులంలోనో పుట్టక తప్పుచేసాడు. ఈ తప్పును దిద్దుకునే అవకాశం నాకుగానీ, మా అబ్బాయికి గానీ లేదు.

తక్కువ రేంకు వచ్చిన వాడి సహధ్యాయిలు పార్టీ చేసుకుంటుంటే వీడు గది బయటకు రావటం లేదు.

ఏం చేయాలి? ఏం చేస్తే వాడి దిగులుపోయి, మామూలు మనిషి అవుతాడు?? మా దంపతులి ద్దరినీ అనుక్షణం వేధించిన ప్రశ్న.

తెలిసిన వారిని, బంధు మిత్రుల్నీ సంప్రదిస్తు న్నారు. ఒక చిన్న 'వెలుగు రేఖ'లా అప్పటి తూర్పు జర్మనీలో బి.టెక్. చదివే అవకాశం దొరికింది. అయితే- ఒక చిక్కు. జర్మన్ మాధ్యమం కనుక జర్మనేతరులు ఒక యేడు ఆ భాష నేర్చుకోవాలి. ఒక సంవత్సరం వృథా! ఇండియాలో ఉన్నా, అంతేనని నచ్చచెప్పి జర్మనీ పంపాము.

'ఎన్నడూ విడిచి ఉండని, ఒక్కగానొక్క కొడుకుని అంతదూరం పంపాము' అన్న బాధ మా దంపతులిద్దరి లోనూ కలుగుతోంది. అన్నం నీరూ సయించటం లేదు మాకు.

"ఎలా ఉన్నావురా కన్నా!" అని మేము లేదా"నేను బావున్నాను నాన్నా!" అని వాడి గొంతులోంచి వినాలన్న ఆరాటం. మనసు నిలవటం లేదు.

వాడు ఉంటున్న ఊరి పిన్‌కోడూ, హాస్టల్ ఫోను నెంబర్

> "అబ్బాయి కృంగిపోయాడు మాట్లాడడు. కదిలిస్తే చాలు కన్నీరు కడవలవుతున్నది వాడి బాధ గమనించి మాకూ బాధ కలుగుతోంది"

సంపాదించి నంబరు కలిపాము. అవతలి వ్యక్తికి ఇంగ్లీష్/రాదు. ఆయన తన భాషలో మేము ఇంగ్లీషు, తెలుగు, రాష్ట్ర భాష హిందీలో మాట్లాడి విఫలులం అయ్యాము. మూడు నిమిషాల పెనుగులాగ. ఫోను పెట్టేసాము. రూ. 150. బిల్లు.

ఇక ఇలా కాదని జర్మన్ భాష తెలిసిన ఓ మిత్రుడిని సంప్రదించాం. నేను ఇండియా నుండి మాట్లాడుతు న్నాను. ఫలనా రూపంలో ఉన్న అబ్బా కళ్యాణ్‌ను దయచేసి పిలవండి" అన్న వాక్యానికి జర్మన్‌లో ఏమంటారో తెలుసుకున్నాము.

నాలుగైదు సార్లు ఆ వాక్యాన్ని వల్లిస్తూ బట్టీ పట్టాను.

ఓ ఆదివారం నాటి రాత్రి భోజనం ముగించుకుని పేరడైజ్ సర్కిల్‌లో ఉన్న టెలిగ్రాఫ్ ఆఫీసుకు వెళ్ళి కాల్ బుక్ చేసాము. సమయం పది గంటలు. 2 లేదు మూడు గంటలు పడుతుందని, ముందుగా రూ.150/- కట్టాలన్నారు.

అడిగిన మొత్తం చెల్లించి మా వంతు కొరకు నిరీక్షిస్తున్నాము.

డేటు మారింది. సుమారు ఒకటిన్నరకు కాలు కలిసింది.

బట్టీ పట్టిన సమతి శతక పద్యం వల్లె వేసినట్లుగా-

"ఇఖె ఫ్రాఖీ ఇండియా. బిట్టె కాల్ కళ్యాణ్. జిమ్మర్ నూర్ సీన్" గడగడా వల్లించి' 'హమ్మయ్య!" అనుకున్నాను.

అటేపు నుండి 'మూమెంట్.. మూమెంట్" అని వచ్చింది. రిసీవర్ ప్రక్కన పెట్టిన చప్పుడు కాసేపు నిశ్శబ్దం. అబ్బాయి లైన్‌లోకి వచ్చాడు.

"హల్లో" అబ్బాయి గొంతు సన్నగా వినపడింది.

...

హమ్మయ్య వాడిగొంతే! ప్రాణం లేచి వచ్చి

"హల్లో..హలో" అంటూ నేనూ, మా ఆవిడ వంతుల వారీగా గొంతులు చించుకుంటున్నాము.

అబ్బాయి ఏదో మాటాడుతున్నాడు. కాని స్పష్టత లేదు. మూడు నిముషాల టైం అయిపోయిందని.. మధ్యలో ఆపరేటర్ గొంతు.

మరో 3 నిముషాలు 'ఎక్స్టెండ్' చేసాము.

మళ్ళీ కాసేపు 'హలో.. హలో..'లు

పొడిగించిన మూడు నిమిషాలూ అయిపోయాయి.

మరో రూ.150/-లు కట్టి బయటపడ్డాము.

సమయం సుమారు రెండు గంటలు.

ఒకరికొకరం వినలేకున్నా మా "హలో.. హలో.."లకు పట్టిన సమయం నాలుగు గంటలు. మూడు వందల రూపాయలు!

వాడిని చూడలేక పోయినా, వాడి గొంతు వినగలిగాము. చాలా సంతృప్తి కలిగింది. మనసులు తేలిక పడ్డాయి.

మరో నెల రోజుల వరకు వాడు వినిపించిన "హలో..."నే మాటి మాటికీ మననం చేసుకుంటూ తేలికపడిన మనస్సులతో గడిపాము.

×××

అప్పటికీ.. ఇప్పటికీ ఎంత తేడా!

ఇప్పుడు అదనపు ఖర్చు ఏమీ ఉండదు. నేను వాడి క్షేమ సమాచారాలు ఇంట్లోంచే, అనుకున్న మరుక్షణం తెలుసుకోగలుగుతాను. మా కోడలు అక్కడ వంట పాత్ర పొయ్యి మీదకు ఎక్కించి, అత్తగారితో పాయసం ఎలా చేయాలో చెప్పించుకుంటుంది. మనవరాళ్ళు పోయిన శనివారం వెళ్ళిన బర్త్‌డే పార్టీ వివరాలు కళ్ళకు కట్టినట్లు ఫోటోలు పెట్టి వివరిస్తారు.

'సాంకేతిక' ఫలాలు జన సామాన్యానికి అందుబాటులోకి రావటం అంటే ఇదే!



-కూర చిదంబరం
సెల్: 8639338675

## కాళోజీ నైజం

కాళోజీ
కాలాలెన్నిమారినా
కలకాలం లోకంలో
శాశ్వతం ఆయన సంతకం

నిజమే ఆయన నైజం
నిక్కచ్చిగా నిర్భయంగా
చాటెను మానవత్వం

పేదవాడే ఆయన హీరో
దోపిడిదొరలపై
అక్షరాయుధాలతో
దండెత్తిన యోధుడు

ఆకలి కేకలను ఏకరువెట్టాడు
చమటచుక్కలను ఎత్తిపట్టాడు
అన్యాయాలపై సమరశంఖం పూరించిన ధీరుడు

సామాన్యుడిగ జీవనం
లోకమంతా తెలిసినా
తెలంగాణ ఆయన జీవనం
యాసనే శ్వాసగా గమనం

కవిలోకంలో ఆయన అక్షరాలు
ఆకాశంలో చుక్కల్లా శాశ్వతాలు
తెలంగాణ అస్థిత్వం నిలబెట్టిన కవిత్వం
కాళోజీకే సొంతం



**-సి. శేఖర్(సియస్సార్),**
9010480557.

## నాన్న

అతడే...
గుండెల్లో
పురిటి నొప్పులు భరిస్తూ
నిద్రలేని రాత్రులెన్నో గడిపిన నిశాకరుడు
పచ్చిగా ఉన్న హృదయానికి
వెచ్చని ఓదార్పునిస్తూ
ఎదలో సమస్యల సునామీని
తీరం దాటకుండా
కంటి కొలుకుల్లో కవాటమేసి
మనసులోని బాధలు
విచ్చుకత్తులై గుచ్చుతున్నా
మునిపంటి కింద నొక్కి పట్టి
మెదడులోని
సన్నని నరాలు చేసే
ఆర్తనాదాల అలజడులతో
రౌద్ర నాదంతో గతి తప్పిన
రుధిర ప్రయాణంలో...
ఆందోళనలో ఉన్న మస్తిష్కాన్ని ఊరడిస్తూ
ఆక్రందనలు అవధులు దాటినా
పెదాలపై
చెరిగిపోని
చిరునవ్వు ముద్రవేసిన చుక్కాని ...



**-మాధవ్ గుర్రాల**
94926 48887

## సెకండ్ వేవ్ కరోనాకిద్దాం కరెంటు షాక్ .....

ఓసీ కంటికి కనిపించని ఓ కరోనారాక్షసి !

ఇన్నాళ్ళు మేము "ఇళ్ళల్లోనే"
బంధీలై పోయిందెందుకో తెలుసా?
రామబాణాలు సిద్దం చేసుకోవడానికి
నీపై సంధించి నిన్ను బంధించడానికి
నిన్ను పాతాళంలో పాతిపెట్టడానికి

ఇన్నాళ్ళు మేము" సెల్ఫ్ ఐసోలేషన్"లో
వున్నదెందుకో తెలుసా?
స్టెన్ గన్ లు సిద్ధం చేసుకోవడానికి
కనిపిస్తే నిన్ను కాల్చి పారెయ్యడానికి

ఇన్నాళ్ళు మేము "సెల్ఫ్ లాక్ డౌన్" ను
భరించిందెందుకో తెలుసా?
కనిపిస్తే నీకు "కరెంటు షాక్ "ఇవ్వడానికి

మేము నిత్యం"ముఖాలకు మాస్కులు"
ధరించి తిరుగుతున్నదెందుకో తెలుసా?
కనిపిస్తే నీ ముఖానికి ముసుగు వేయడానికి

మేము నిత్యం" "భౌతిక దూరం"
పాటించే దెందుకో తెలుసా?
కత్తులు కటారులు నూరుకోవడానికి
కనిపిస్తే నీ తలనరికి నీ హాహాకారాలు విని
సంతోషంతో సంబరాలు చేసుకోవడానికి

మేము నిత్యం "సబ్బుతో చేతులు"
శుభ్రం చేసుకునేదెందుకో తెలుసా?
గంద్రగొడ్డళ్ళను పదును పెట్టడానికి
"సెకండ్ వేవని" వస్తే నిన్ను మట్టుపెట్టడానికి

ఓసీ కంటికి కనిపించని ఓ కరోనారాక్షసి !
మా డాక్టర్లింకా ప్రయోగశాలల్లో
మేధోమథనం చేస్తున్నదెందుకో తెలుసా?
త్వరలో నీకు"మందు" కనిపెట్టడానికి
నీకు బొందపెట్టడానికి నీకు సమాధికట్టడానికి



**-పోలయ్య కవి కూకట్లపల్లి**
9110784502

## నానీలు

అర్థం చేసుకుంటే
అమృతమూర్తి!
అవహేళన చేస్తే
అపర కాళీ!!

అందం ఆకర్షణ
ఆమె రూపం !
సహనం శాంతం
ప్రేమ ఆమె స్వభావం!!

ఆకాశంలో సగం
అవనిలో సగం!
గుర్తిస్తేనే నీవు
పరిపూర్ణం!!

సహనంలో అవని
ఆమె!
సహనం కోల్పోతే
అపరకాళి ఆమె!!

స్త్రీని దేవతగా
పూజించకు!
సాటి మనిషిగా
గుర్తుంచి గౌరవించు!!



**-ఉదయశ్రీ ప్రభాకర్**
9866687134

## ఆనందం తాగిన మైకంలో....

నవీన పోకడలో
నడక కోల్పోయిన
సంస్కృతి స్పృహ తప్పి
కావ్యాల్లో చిక్కుకుపోయింది.
కృత్రిమ నాడితో
మేధస్సుకు
మతి భ్రమించింది.
పునాది మరిచింది.
ఆధునిక ఆనందాలను
తాగి తాగి మైకంలో
మానవాళి
మనసును హత్య చేసి
ఇంగితాన్ని మరచి
మనిషి పరువును
వీధిన పడేసుకుంది.



**- సాహితి**
83094 63567

# మా'నవ'సంబంధాలు

మనిషి సంఘ జీవి, ఏకాకిగా నివసించ లేడు. తన అనుభూతులను పంచుకోవడానికి ఒక బంధం కావాలి, తనలోని ఉద్విగ్నతలకు ఒక రూపం రావాలి, నవరసాలు అర్థం చేసుకునే సాటి మనిషి సాయం కావాలి, ఒక్క మాటలో చెప్పాలంటే ఇతర ప్రాణులనుండి మనిషిని మాత్రమే వేరు చేసే ఉపకరణం మానవ సంబంధం.

అరిస్టాటిల్ నుండి కారల్ మార్ఖ్ వరకు భిన్న అభిప్రాయాలున్నా మనిషి మనుగడ కోసం చేసే పోరాటం లో ఏకైక ఆయుధం ఈ సంబంధం.

ఆది మానవుడు క్రూర మృగాలనుండి రక్షించుకోవడానికి ఒక సంఘటితం గా ఏర్పడి పోరాడి గెలిచాడు.

ఒక్కరు ఉంటే సాధించలేని పని పదుగురు కలిస్తే ఎంత సంక్లిష్టమైన పని అయినా సాధించవచ్చు అని తెలుసుకున్నాడు.

అందుకే ఉమ్మడి కుటుంబాలు ఏర్పడ్డాయి. కష్ట ,సుఖాలలో పాలుపంచుకునే వ్యవస్థ ఏర్పాటయింది.

ప్రేమ,ఆప్యాయతలు, నైతిక విలువలు సభ్య సమాజంలో ఎలా ప్రవర్తించాలో కుటుంబ వ్యవస్థ తెలియజేసింది.

నేటి జీవన విధానం అయితే నేడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్చిన్నమయ్యింది.

పెరుగుతున్న నవ నాగరికతల, మారుతున్న జీవన విధానమునకు అనుగుణముగా సమాజంలో శర వేగముగా మార్పులు చోటు చేసుకున్నాయి.

ఫలితముగా వ్యక్తి ఒక్కడుగా మిగిలిపోతున్నాడు.

ఆర్థిక స్వేచ్ఛ కోసం, పరుగులు తీస్తున్నాడు.

ఉమ్మడి కుటుంబంలో ఒక్కడు కష్టపడితే పదిమంది కూర్చొని తినేవారు, కానీ ఇప్పుడు కోర్కెలతో బాటు ఆధునిక విలాసాలకు, సౌకర్యాలకు అలవాటు కావడంతో సంపాదన సరిపోవడం లేదు,తృప్తిని చెందని మనుజుడు సప్తద్వీపంబుల నైన చక్కంబడునే అన్నట్లు తృప్తి లేని మనిషి అందని వాటికోసం అర్రులు చాస్తూనే ఉంటాడు, అందలం ఎక్కాలనే ప్రయత్నంలో అథః పాతాళానికి పడి లేస్తూనే ఉంటాడు, భోగ భాగ్యాల కోసం, తరాల వారికి కూడా సంపద చేరవేయాలన్న దురాశ కోసం ,పరుగెత్తి పాలుతాగాలనే ప్రయత్నం చేస్తున్నాడు.

సమిష్టితత్వ భావన, పరస్పర ఆధారిత భావనలను కలిగించడంలో ఉమ్మడి కుటుంబం పాత్ర కీలకమైనది. నగరీకరణ పుణ్యమా అని నవతరం ఉమ్మడి కుటుంబ ఆప్యాయతానురాగాలకు నోచుకోలేకపోతున్నది.

మానవ సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలే అన్న అరిస్టాటిల్ మాటలు అక్షర సత్యాలవుతున్నాయి. సంబంధాలన్నీ ఆర్థిక చట్రంలో ఇరుక్కుపోయాయి. అమ్మ లాలన, వృద్ధుల పోషణ, కుటుంబ పాలన మొదలైనవన్నీ కరువైనాయి..

డబ్బు సంపాదన ఒక్కటే జీవన పరమార్థం అయ్యింది.

విద్యా ప్రమాణాలు అడుగంటాయి.పాఠ్యఅంశాలు కేవలం విషయ పరిజ్ఞానాన్ని మాత్రమే అందిస్తున్నాయి. విద్యార్థి సమాజంలో ఎలా మెలగాలో ,నైతిక విలువలను ఎలా పెంపొందించుకోవాలో తెలవడం వల్ల, భావితరాలను మేలుకొలపవచ్చు.శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం మనిషిని నాలుగు గోడల మధ్య బంధింప జేస్తుంది, కంప్యూటర్లు, టీవీ లు, చరవాణి లు ఇవన్నీ ప్రపంచ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ, మనిషికి ఉండాల్సిన మానవత్వం, ప్రేమ తత్వం, సంఘ భావం కూడా ఉంటే మనిషి మనీషి కాగలడు.

**-సముద్రాల శ్రీదేవి**
9949837743

## మినీ కవితలు

### దండం పెట్టు

చలేస్తుందని కాదు
ఒంటినిండా గొంగళి కప్పుకున్నది
ఈ వెచ్చదనాన్ని దానం చేసిన
ఆ గొర్రెపిల్ల కాళ్ళకు
దండం పెడదామని

### అమ్మ శబ్దాలు

నాలుగు వేదాలను కలిపి
గట్టిగా ఉచ్ఛరించాను,
అన్ని శ్లోకాలనిండా అమ్మ శబ్దాలే
ఓంకారం సైతం పసిపాపై
అమ్మ చాటున ఆడుకుంటోంది

### కథానాయకుడు

గుండె గాయాల్ని
కన్నీళ్ళతో కడుగుతాడు
రోదించే కళ్ళకు
ఓదార్పు లేపనాలవుతాడు
కరుణశ్రీ కావ్యానికి
కథానాయకుడు దొరికాడు

### చాలా ఖరీదు

నెమలిపించం నాకిష్టం
దాని దేహంనిండా
వజ్రాల కిరీటాలు
ఖరీదు మాత్రం
అమ్మ చిరునవ్వంత



**-డా. కె.జి. వేణు**
98480 70084

## నన్ను మన్నించు

నీరు కట్టుకుని
బురదజిమ్ముకుని
అరువులెత్తుకుని
బరువుమోసుకుని
ఎరువులేసుకుని
కోతకోసుకుని
కుప్పనూర్చుకుని
చెమటచుక్క రాశికెక్కింది...
ఎందుకో ఆ చెమటచుక్క బతుకులో
నిరాశ నిశే మిగుతోంది...

ఈ రాశికి నా నమస్కారం
ఈ రాశే కదా నా పళ్ళెంలో పట్టెడన్నం
ఈ రాశే కదా ఆకలికి వేస్తది గొళ్ళెం
బువ్వ తిని మరీ...
ఆ కర్షకుడి కష్టానికి నేను వేయలేకున్నా కళ్ళెం
నాకన్నా కృతఘ్నుడు ఎవడున్నాడు
ఈ సమాజంలో
నన్ను మన్నించు మట్టి మనిషి....



**-అభిరామ్**
9704153642

## ఆ నలుగురు ఎక్కడ..?

జన సంపత్తికి నెలవులు
సప్త బిలియన్లు దాటిన లోకులు
భారత్ నిండా జనసంచారాలు !.
సద్గుణాలకు తిలోదకాలిచ్చి...
విత్తం వెంటే వెర్రి పరుగులు
జనం గోలంతా పైకమేనంట !.
మర్యాదలు బలహీనతలై..
నిజాయితీ అక్కరకురాని చుట్టమై..
కర్తవ్య నిష్టే చేతకానితనమైన అకాలమిది !.
డబ్బు తెరలు కమ్మిన కళ్ళు..
కనిపించవు కదా నైతికతలు..
న్యాయవలువలు ఒలిచే నీచ ప్రబుద్ధులు !.
'కోరిక' కరాళ నృత్యం చేయగా..
'ధర్మాన్ని' కటిక చీకటిలో కప్పేయగా..
అశ్లీలతలే నవ్య సంస్కృతులైన అకాలాలు !.
చెత్తను తొలగించే చీపుర్లున్నయ్..
మురికిని వదిలించే చాకిరేవు బండలున్నయ్..
మనో అశుద్ధిని ఊడ్చే ఉపకరణం లేదు మరి !.
అటు, ఇటు, ఎటు చూసినా..
నర(క)లోక సముద్రం గాలించినా..
అంతిమయాత్రకు
కరువు ఆ నలుగురే కదా !.



**- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**
99497 00037

## నవ్వీన కమలం

పంకంలో పుట్టినా విరబూసిన కమలం
రాజ్యలక్ష్మికి ఆసనం
పుట్టుక ఏదైనా పట్టుదలే నీ ఆభరణం!!.
జాతి వివక్ష ఎదురైనా
గెలుపే నీ లక్ష్యం
తల్లి సంరక్షణలో
తండ్రి సంతోషంతో
పెరుగుతున్న క్రమంలో
ఆటుపోట్లు ఎన్నున్నా
ఆట కట్టించడమే నీ విధి!!.
అగ్రరాజ్యమైనా అమెరికాలో
ఆధికత్యపోరులో వెన్ను జూపక
సత్తా జూపిన భారతీయ సంతతి
ప్రపంచానికే తలమానికం
ఉన్నత పదవి నలంకరించి
నవ్వీన కమలం!!



**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**
9440720324

## అతిశయోక్తి రాగం

తనేమో
ఎండమావుల్లో నీళ్ళను
కుండనిండా నింపుకొచ్చి
నా దాహం తీరుస్తానని
పందెం కాస్తుంది...

నేనేమో
ఆకాశంలోంచి
చుక్కలు కోసుకొచ్చి మాలకట్టి
తన తలలో తురుముతానని
నిశ్చయంగా వాగ్దానం చేస్తాను...

ఇంతలో
మా ఏడేళ్ళ మనవడు
మా ఇద్దరి మధ్యలో దూరి
దివిలోని నక్షత్ర మండలాన్ని
గుప్పెట్లో బంధించి
నా బలం నిరూపించుకొని
జీవితాంతం మీకు
తోడుంటానంటాడు-

అతిశయోక్తుల
తుఫాను ఉధృతిలో
కొట్టుకుపోతున్న
మా ఆలోచనలు-

మా సంభాషణలు
వింటున్న మా పెద్దది
ఫక్కున నవ్వి-
వెన్నెలపూలు కోసుకొచ్చి
నిత్యం సూర్యుళ్ళు మొలుస్తున్న
మా దేహాలపై ఎద పెడతానంటుంది...

ప్రేమలు తెలియని
అహంకారపు జీవితాలు కొన్ని
పేకమేడల్లా కూలిపోతున్న సమయాలు...

అతిశయోక్తులైనా సరే
ప్రేమ పుష్పాల సువాసనల్లో
పునీతులమవుతూ
దేహంలో ప్రతీ అణువు
ఆనంద డోలికల్లో తేలియాడుతూ
చిరునవ్వులు చిందిస్తూ
ఇలా..ఇలా..మేమూ!



**-విల్సన్ రావు కొమ్మవరపు**
89 85 43 55 15

# ఆదివాసి కథ - పరిశీలన

> "గిరిజన పోరాట కథాసాహిత్యంలో అద్భుతమైన దృశ్యకావ్యం లాంటిది బి.ఎస్.రాములు రాసిన "అడవిలో వెన్నెల" కథ"

> తెలంగాణలో జరిగిన పరిణామాలన్నీ కథల్లో కనపడతాయి. కథా రచయితలు ఇక్కడ జరిగిన మార్పులను, పోరాటాలను, ఉద్యమాలను, నేపథ్యంగా తీసుకొని కథలు రాశారు. అలా కథ వొక చారిత్రక వనరుగా నిలిచింది. ప్రజల సుఖ దుఃఖాలను, ప్రజలు తమ అభివృద్ధి కోసం జరిపిన ప్రయత్నపరంపరను కథ పట్టించు కొంది. భండారు అచ్చమాంబ నుండి నేటితరం రచయితల వరకు రాసిన కథలు అన్నీ కూడా ప్రజల పక్షం నిలిచాయి. తెలంగాణలో జరిగిన వికాసం మొదలుకొని నేటి ప్రపంచీకరణ సందర్భంగా జరుగుతున్న విస్మృతి వరకు, పోయిన పోకడలన్నీ కూడా కథల్లో కనపడ తాయి. విస్మృతికి గురి అయిన సమూహాలు తలెత్తుకొని, తమ అస్తిత్వ ఆకాంక్షలను ఎలుగెత్తి చాటిన విధానాన్ని కూడా కథ అక్కున చేర్చుకుంది. తెలంగాణ కథ నడిచిన దారులను పరిశీలించి, కథ ప్రజల వెతలను ఏ విధంగా పట్టించుకుందో డా॥ బి.వి.యన్.స్వామి వివరిస్తున్నారు.
>
> – సంపాదకులు

1920 నుండి 1940 దాకా మనదేశంలో ఆదివానుల పోరాటాలు అనేక ప్రాంతాల్లో చెలరేగినట్లుగానే తెలంగాణలో 1970 నుండి ఆదివాసుల పోరాటాలు రగులుతున్నాయి. కొమురంభీం పోరాటకాలం వరకు లేదా మైదాన ప్రాంతాల వాళ్ళు గిరిజన గూడాల్లో అడుగుపెట్టే వరకు వీళ్ళ బ్రతుకులు బాగానే ఉండేవి. వీళ్ళు అక్కడ అడుగుపెట్టగానే వాళ్ళలో కల్లోలం మొదలైంది. అటవీ సంపదను అతి తక్కువ రేటుకు తీసుకొని, బెల్లం, పొగాకు లాంటి సరుకులను ఆదివాసులకు అడ్డగోలు ధరలకు అమ్మినారు. బాకీల పేరుతో నాగటెడ్లను, పాడిపంటలను తుదకు పంట భూములను నాగరికులు ఆక్రమించుకున్నారు. వాళ్ళ భూముల్లో వాళ్ళనే కూలీలను చేశారు.

అటవీ అధికారుల జులుం కూడా ఆదివాసులపై ఎక్కువగానే సాగింది. గిరిజనుల మేకలు, పశువులు అడివిలోకి వచ్చాయన్న నెపంతోనో, గంజాయి పండించారన్న కారణం తోనో, సారా తయారు చేసారన్న సాకుతోనో ఆదివాసులపై దౌర్జన్యం చేశారు. గిరిజనుల సారాను, ఏరుకున్న ఇప్పపువ్వును, అటవీ ఉత్పత్తులను, పండించుకున్న పంటను అన్నిటిని తీసుకెళ్ళేవారు. ఆదివాసులకు, అడవిలో బ్రతకడం దుర్భరమైంది. అలాంటి సమయంలో వారిని ఆదుకోవడానికి "అన్నలు" అని పిలువబడే ఉద్యమకారులు అడవిలోకి వచ్చారు. వీరు వచ్చాక అటవీ పోరాటాలు ఉధృతమయ్యాయి. ఇవి మొదలయ్యాకనే అంతకు ముందు అంతగా సాహిత్యానికెక్కని గిరిజనుల గూర్చి, వాళ్ళ సంస్కృతి గూర్చి, వారి జీవన విధానం గూర్చి అడవితో మమేకమైన వారి బతుకు గూర్చిన కథలు రావడం మొదలయ్యాయి. వాళ్ళ కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ, వారిలో ఒకరుగా మెలగుతూ, వారి కోసం పోరుచేసిన వాళ్ళు "పౌరకల సార్లు" గా పిలువబడ్డారు. అటువంటి పౌరకల సార్లలో సాహు ఒకరు. గిరిజనుల గూర్చి అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించడమే కాకుండా వాళ్ళతో మమేకమైన వాడు సాహు. ఎనబయ్యవ దశకంలో తెలంగాణ అనుభవించిన అన్ని రకాల సంక్లిష్ట జీవితాన్ని సాహూ అనుభవించాడు. దాదాపుగా ఇరవై కథల వరకు సాహు రచించాడు. మైదాన ప్రాంతాల వారి ప్రవేశం వల్ల గిరిజనుల జీవితాల్లో ఆటంకాలు, భయాందోళనలు, వారి జీవితాల్లో భాగస్వాములయ్యాయి. తమ ఆచారవ్యవహారాల వల్ల కూడా గిరిజనులు దుర్భర జీవితం గడుపుతుంటారు. ఇవన్ని కూడా కథల్లోకి వచ్చి చేరాయి.

దట్టమైన అడవులలో కనీస సౌకర్యాలైన నీటికోసం వారు పడే అవస్థలను సాహు రాసిన "కన్నీటి కథ–నీటి కథ" చిత్రిస్తుంది. "నిర్ణయం" కథలో గిరిజన బతుకు వ్యధకు కారణం వారి అమాయకత్వం, అడవిలోని జంతుజాలం, ప్రభుత్వ విధానాలు అని నిరూపించాడు. ఇతను రచించిన "రక్తపింజెర" కథలో గిరిజనుల జీవనశైలి ప్రతిబింబిస్తుంది. భార్యాభర్తలుగా వారి సంసార బంధం ఎలా ఉంటుందో కనబడుతుంది. గిరిజను లను పీల్చి పిప్పిచేసే ఫారెస్ట్ అధికార్ల గురించి, కంక బొంగుపని దగ్గర సూపర్‌వైజర్ రాక్షసత్వం గురించి కథ ద్వారా తెలుస్తుంది. గిరిజన పోరాట కథాసాహిత్యం లో అద్భుత మైన దృశ్యకావ్యం లాంటిది బి.ఎస్.రాములు రాసిన "అడవిలో వెన్నెల" కథ. షావుకార్ల చేతిలో, ఫారెస్టుఆఫీసర్ల చేతిలో గిరిజనులు ఏవిధంగా మోసానికి గురవుతున్నారో కథలో చిత్రించారు. గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలు కథలో కనపడుతాయి. గిరిజన గూడెంలో ఉద్యమం ఏ విధంగా వేళ్ళూనుకున్నదో ఈ కథ ద్వారా తెలుస్తుంది. గిరిజన గూడెంలో భౌతిక వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లుగా రాసిండు. గిరిజనోద్యమ విజయ రహస్యాలు కథ ద్వారా తెలుస్తాయి.

కరువు కాటకాల్లో గిరిజనులు యాతన అనుభవిస్తుం డగా గూడెంలపై పోలీసు దాడులు జరగడం వల్ల ఊరి వాళ్ళందరు చెట్టుకొకరు పుట్టకొకరు కావడం, అలా అయిన స్త్రీ నేపథ్యాన్ని తీసుకొని అల్లం రాజయ్య రాసిన "బురద" కథ ఆమె జీవితాన్ని చిత్రించింది. షావుకార్లు గిరిజనుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని వారిని ఏ విధంగా వేధించుక తింటారో పి.చందురాసిన "అనామతుఖాతా" తెలుపుతుంది. ఆదిలాబాద్ గిరిజన ప్రాంతాల్లో జరిగిన ఒక యదార్థ సంఘటనకు అక్షరరూపం ఈ కథ. షావుకార్లు గిరిజనులను ఏ విధంగా దోచుకుంటారో, ఏ విధమైన ఇబ్బందులకు గురిచేస్తారో విపులంగా చెప్పాడు. పరికించి చూస్తే ప్రతి జీవితం ఒక కథగా కనబడు తుంది. దోపిడీ చేయడం, చేయబడటం అనేది ఉన్నంత కాలం, దోపిడీకి ప్రయత్నించి నంతకాలం జీవితాల్లో నాటకీయత ఉండక తప్పదు. అనామతుఖాత పేర ఏమి ఇవ్వక సంతకం చేయించుకున్న షావుకారి తిరిగి ఏడేండ్ల తర్వాత అప్పు తీర్చమంటూ సాయిలు ఇంటికి రావడం ఒక విషాదం, కుట్ర గిరిజనుల జీవితాల్లో ఇవి నిత్యకృత్యాలయ్యాయి. ఇలాంటి సంఘటనల ద్వారానే గిరిజనులు ఉద్యమ మార్గం పట్టారు. ఈ విషయం కథ ముగింపులో తెలుస్తుంది.

అన్ని దిశల నుండి గిరిజనులు దౌర్జన్యాల పాలు అవుతుంటారు. తమ సాగు భూములు అన్యాక్రాంతం కావడాన్ని సహించలేని గిరిజనులు "దున్నేవాడికే భూమి" నినాదంతో ఏకమైతరు. ఈ విషయాల్ని సాహు రాసిన "మరట్‌తుడుం పాయనా!" (మనందరం తుడుంగొట్టాలె) అనే కథ చిత్రించింది. గిరిజనులకు వెన్నుదన్నుగా నిలబడిన నక్సలైట్లను పోలీసుల బారినుండి గిరిజనులు ఏ విధంగా రక్షిస్తారో సాహు రాసిన "గంగజిమ్మ" కథ తెలుపుతుంది. తెలంగాణలో గిరిజన ఉద్యమాలు ఎందుకు జరుగుతు న్నాయో, ఏ విధంగా జరుగుతున్నాయో పాఠకులకు విడమరచి చెప్పిన కథ తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన "కెరిమెరిఘాట్‌రోడ్". ఇంకా గిరిజన జీవితాలతో మమేకమై, వారి ఆచార వ్యవహారాల్ని, పోరాటాల్ని గురించి రాసిన కథలు అనేకం ఉన్నాయి. "అన్నలొచ్చిన్రు", "పెళ్ళికావాలి", "కాయిదా", "ఐదు రూపాయలకథ", "భూమి కొరకు", "జెండాకథ", "ఆకలి", "కిసింగార్ వెంతా", "నాడె" "మనుషుల్ని తినేవాళ్ళకోసం", "ఒక తల్లి", "పిల్లరక్కసులు", "ఓ సత్యం కథ", "అమరవీరులు", "ఊరేగింపు", "రగల్‌జెండా", మొదలగు అనేక కథలు గిరిపుత్రుల విశేషాలను, జీవన విధానాన్ని, అడవి చిత్రణను, అన్నల బోధనలను, గిరిజనుల తిరుగుబాటును, సూపర్‌వైజర్స్ దాష్టీకాన్ని, ఫారెస్ట్ రేంజర్స్ అకృత్యాలను కళ్ళకు కట్టినట్లుగా చూపెడుతాయి. "దొంగ గొడ్డుకు లొటారం", "కంకలట్టు తుపాకులు", "తునికి చెట్టు", "మన్యం మండుతోంది" లాంటి కథలు గిరిజనోద్యమాన్ని గిరిజన పోరాటాలను చిత్రించాయి.

అడవి మీద రాబడిని పెంచుకోవడానికి నిజాం సర్కారు 1925–26 ప్రాంతంలో ఆదిలాబాదు గిరిజన ప్రాంతాల్లోకి ఇంగ్లీషు వాళ్ళు చేసిన అటవీ చట్టాల్ని తెచ్చింది. గిరిజనుడిని అడవినుంచి, భూమి నుంచి వేరుచేసి అడవిని ఆక్రమించే దురుద్దేశంతో బ్రిటిష్‌వాళ్ళు 1920లో అటవీ చట్టం తెచ్చారు. దాన్ని నిజాం అమలుపరిచాడు. బ్రిటిష్ చట్టానికి వ్యతిరేకంగా 1885లోనే ఆదిలాబాద్ ఉట్నూర్ తాలూకా గోండులు రాంజీగోండు నాయకత్వాన యుద్ధం చేసారు. ఆ యుద్ధంలో దాదాపు 300 మంది గోండులు బలి అయ్యారు. రాంజీగోండుని నిర్మల్‌లో ఉరి తీసారు. అప్పటినుండి గిరి జనులు, పాలకుల మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. నిజాం తెచ్చిన అటవీ చట్టం ఫలితంగా గిరిజనుడు తను సాగుచేస్తున్న భూమిని కోల్పోయి అటవి లోతట్టు ప్రాంతాలకు తరలిపోవాల్సి వచ్చింది. తిరిగి అక్కడ కొత్తగా "పోడు" వ్యవసాయం చేసుకోవాల్సి వచ్చింది. భూమిని కోల్పోవడం వల్ల గిరిజనుడు బాధలు పడ్డాడు. గిరిజనులు భూముల్ని చదును చేసి వ్యవసాయ యోగ్యం చేస్తే భూస్వాములు వాటిని తమ పేరున పట్టాలు సృష్టించి స్వంతం చేసుకోవడం, మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన షావుకార్లు గిరిజనులకు

> "అడవి మీద రాబడిని పెంచుకోవడానికి నిజాం సర్కారు 1925-26 ప్రాంతంలో ఆదిలాబాదు గిరిజన ప్రాంతాల్లోకి ఇంగ్లీషు వాళ్ళు చేసిన అటవీ చట్టాల్ని తెచ్చింది"

డబ్బులిచ్చి వడ్డీవ్యాపారం చేసి ఏదోకారణంతో భూముల్ని లాక్కోవడం, వీటికి తోడు అటవీ సంరక్షణ కోసం నియమించబడిన ఫారెస్ట్ అధికారుల పీడన, గిరిజనులను ఆలోచనకు పురికొల్పాయి. కొమురం భీం నాయకత్వంలో గిరిజనులు సంఘటితమయి "రాజ్యాధికారం" కోసం యుద్ధం చేసారు. 1939లో బాబేఝరీ కొండల్లో గిరిజనులు భీం నాయకత్వంలో సాయుధులయ్యారు. జోడెన్ ఘాట్ పోరాటాన్ని 1940 సెప్టెంబర్ 1న నిజాం సైనికబలం అణచివేసింది.

ప్రభుత్వరంగ సంస్థలైన కార్పోరేషన్లు, షావుకార్లు, మైదాన ప్రాంతీయులు, గిరిజనుల అమాయకత్వాన్ని, ఆసరా చేసుకొని దోపిడీ చేస్తునే ఉన్నారు. అడవిలోంచి కట్టెలు తెస్తే జరిమానా, పశువుల్ని మేపితే పన్ను, దొంగకేసులు, లంచాలతో గిరిజనుల్ని పీడించారు. అనేక ఇతర రూపాలలో గిరిజనుడు దోపిడీకి గురి అయ్యాడు. వీటన్నిటి కారణంగా మళ్ళీ గిరిజనోద్యమాలు తెలంగాణాలో మొదలయ్యాయి. వీటికి తోడు కార్మిక, రైతాంగ పోరాటాలు నడుస్తూనే ఉండటం వల్ల గిరిజన ఉద్యమాలు వాటి నుండి స్ఫూర్తిని పొందాయి. భూమిమీద, అడవిమీద హక్కుకోసం గిరిజన రైతుకూలి సంఘం కింద గిరిజనులు ఒక్కటయ్యారు. ప్రభుత్వ అణచివేత ఎక్కువయింది. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా ఆదిలాబాద్ జిల్లా గిరిజన రైతుకూలీ సంఘం ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న మొదటి మహాసభ జరప తలపెట్టింది. ప్రభుత్వం దీన్ని అడ్డుకుంది. ఆ క్రమంలో పోలీసు కాల్పులు జరిగాయి. అనేకులు మరణించారు. ఇంద్రవెల్లి సంఘటన గిరిజనుల్ని మరింత సంఘటితం చేసింది. ఇంద్రవెల్లి సంఘటన గిరిజన పోరాటసాహిత్య సృజనకు దారులువేసింది. గిరిజన జీవితంలో కనిపించే యాతన, పోరాటం, మోసం, మూఢాచారాలు సమస్తం, మొత్తంగా గిరిజనజీవితం కథా వస్తువైంది. అలా గిరిజనకథలు వచ్చాయి. గిరిజన కథలోకి గిరిజన భాష కూడా వస్తువుతో బాటు వచ్చి చేరింది.

జీవన్ రాసిన "పోటెత్తిన జనసంద్రం" కథలో పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపుకు గురికాబోతున్న గిరిజన గూడాల్లోని గిరిజనుల ఆగ్రహం కనబడుతుంది. ఈ కథలో ప్రజాగ్రహం పోరాట రూపం తీసుకొనే క్రమం కనపడుతుంది. గిరిజన సంస్కృతి, ఆచారాలు, ప్రేమలు, వాతావరణం, పంటలు మున్నగు సాంస్కృతికాంశాలన్ని కుప్ప బోసినటుల రాసిన కథ "జంగుబాయి". ఈ కథ రాసిన గోపి భాగ్యలక్ష్మి అత్యంత తక్కువ కథలు రాసింది. కథలోని వర్ణనలు, గిరిజనుల అలవాట్లు, అడవి జంతువులు, ఇవన్ని కలిసి కథ అడవిని చూపించినట్లుగా ఉంటుంది. పురుళ్ళు, వివాహాలు, పంచాయతీలు, పండగలు, కులపట్టింపులు ఇలా చాలా విషయాల్ని రచయిత్రి మనసుకు హత్తుకునే విధంగా చిత్రించింది. చిన్న చిన్న జీవిత విశేషాల్ని రచయిత్రి అందమైన కథగా మలిచింది.

గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొందరు భూస్వాములు, వాళ్ళ భూముల్ని కాజేశారు. వాళ్ళకు అప్పులిచ్చి భూమి తనఖా పెట్టుకోవడం, అప్పుతీర్చలేని సమయాన లాక్కోవడం, ఇలా మరిన్ని భూముల్ని ఆక్రమించుకోవడం భూస్వాముల పనిగా చరిత్రలో మనకు కనపడుతుంది. తరువాత కాలాన చైతన్య వంతులైన గిరిజన యువకులు తిరగబడడం, ఆ సమయాన భూస్వాములు, పోలీసుల్ని, కోర్టుల్ని ఆశ్రయించడం ఆనవాయితీ అయింది. ఇదంతా కూడా శిరంశెట్టి కాంతారావు రచించిన "బిగిసిన ఆ పిడికిళ్ళు" అనే కథలో కనపడుతుంది. పి. విద్యాసాగర్ రాసిన "దాడి' కథలో మరొక కోణం కనపడుతుంది. "కోయలు" లోకల్. "గుత్తికోయలు" నాన్‌లోకల్ ఛత్తీస్‌గడ్ నుండి సల్వాజుడుం తరిమితే వచ్చిన వీరు అడవిలో 25 ఎకరాలను నెలరోజుల్లో చదును చేసి వ్యవసాయం చేస్తారు. వారిని అక్కడినుండి తరమడానికి ఫారెస్ట్ రేంజర్, పోలీసు ఎస్.ఐ కోయసిరమప్ప ప్రయత్నిస్తారు. ఎవరిచేతికి మట్టి అంటకుండా వారిని ఎట్ల తరమాలో ముగ్గురు పథకం పన్నారు. ఇందులో ఎవరి లాభాలు వాళ్ళకున్నవి. కోయవాళ్ళను గుత్తికోయలపై ఉసిగొల్పడంలో విజయం సాధిస్తారు. తగవులాటపెట్టి ప్రయోజనం పొందే నాగరీకం, అమాయక గిరిజనుల మీద ప్రయోగించడాన్ని కథలో పూసగుచ్చినట్లు వివరించాడు.

అడవిలో గిరిజనులు ఏ విధంగా బ్రతుకుతున్నారు ? వారి జీవన శైలి, బతుకులో భాగంగా వారు ఎదుర్కొనే అపాయాలు, కష్టాలు, విపత్తులను సంఘటనల ఆధారంగా మెస్రం మనోహర్ 'ఇప్పపూలు" అనే కథ రాసారు. ఇది ఆదివాసుల యదార్థగాథ. అడవిలో ఇప్పపూవు ఏరుకొని బతకడం గిరిజనుల అలవాటు. అది వారి ప్రధాన ఆదాయవనరు. వెనకటి కాలాన కొందరు సేట్లు వారికి నచ్చిన ధరతో కొనేవారు. దాంతో గిరిజనులకు తక్కువ సంపాదన ఉండేది. గిరిజన కార్పోరేషన్ ఏర్పాటై వారికి ఎక్కువ ధర చెల్లించడం వల్ల కొంత ఎక్కువ పైస గిరిజనులు కళ్ళ జూశారు. ఇప్పపూవు ఏరుక రావడమే ప్రధాన వ్యాపకంగా పెట్టుకున్న వారికి ఎదురయ్యే ప్రమాదాలు ఎలా ఉంటవో కళ్ళకు కట్టినట్లు తెలిపాడు. గిరిజనులకు ఇప్పకల్లు ప్రధాన పానీయము. అది తాగనివారు ఉండరు. అది ఆరోగ్యానికి మంచిదని వారి నమ్మకము. ఖర్చులేకుండా దొరకడం, అందరికి అందు బాటులో ఉండడం వల్ల అందరు తాగడం ఒక ఆచారం. అలాంటిది గిరిజనులకు ఖరీదైన వస్తువుగా మారడం వారి జీవితాల్ని ప్రశ్నలతో నింపింది. వారిని బాధకు గురిచేసింది. అనివార్యమైన ఆ తతంగం గూర్చి ఇలా అంటాడు.

"ఇప్పపూల కల్లు కల్తీలేనిదైతే ఆరోగ్యానికి మంచిదని మన పాతకాలపు పెద్దలు చెబుతారు. అయినా అమ్మకము జేసి రూపాయలు జమచేసే టోళ్ళకు కల్తీతో ఏమిపని వాళ్ళకు రూపాయలు కావాలగాని ఎప్పుడైతే మన అడవి పల్లెల్లోకి వేరే వారు రావడము ఎక్కువైనదో అప్పటి నుండి ఈ ఇప్పకల్లు కూడా బజారులో అమ్మె వస్తువులా మారిపోయింది."

ఈ వ్యాపారం గిరిజనుల ఆరోగ్యాన్ని దెబ్బతీసింది. వైద్య సహాయం అంతంత మాత్రంగానే ఉండే గిరిజన ప్రాంతాల్లో ఈ ధోరణి వారి ప్రాణాల మీదికి వచ్చింది. నీళ్ళ కోసం ఏరువద్దకు వెళ్ళినవారు జంతువుల బారిన పడడం, జంతువులను చంపడానికి గోలిపెట్టడం (పేలుడుపదార్థాల పెట్టె) వల్ల, దెబ్బతిని చావక బ్రతికిన జంతువు బారిన పడడం, గూడెల్లోకి పులి రావడం, పాముల బారిన పడడం, మిడతల దండు దాడి చేయడం, వీటన్నిటికి తోడు కరువు తాండవించడం, నిరక్షరాస్యత నృత్యం చేయడం గిరిజనుల పాలిటి నిత్యసత్యాలు. కరువు రోజుల్లో వారి ఆహారం గురించి విపులంగా కథలో చర్చించాడు. అడవి తల్లి బిడ్డలు కష్టాలు పడుతుంటే గిరిజనేతరుడైన సేట్ ఏవిధంగా గిరిజనుల్ని దోపిడీ చేసి ఎదిగిండో కళ్ళకు కట్టినట్లు దృశ్యమానం చేసిండు.

గిరిజనులు అక్షరాస్యులై నాగరికులతో చేయి కలుపుతున్నారు. అయినప్పటికీ స్వంత సంస్కృతి, సంప్రదాయాల పట్ల వీరికి విశ్వాసం ఎక్కువ. ఆ విషయాన్ని పాకాల యశోదారెడ్డి రాసిన "సంకుదేముడు" కథ చిత్రించింది. మారుమూల గిరిజన ప్రాంతాలలోకి చొచ్చుకొస్తున్న అభివృద్ధి నమూనాలు స్థానికుల జీవితాల్ని విషాదంలో నింపుతున్నాయి. పరిశ్రమలు, ప్రాజెక్టులు, రోడ్లు మొదలగు వాటివల్ల గిరిజనులకు మేలుకంటే హాని ఎక్కువగా జరుగుతున్నది. ఈ స్థితి గిరిజనుల్ని తమ పిల్లల్ని సైతం అమ్ముకునే స్థితికి నెట్టివేస్తున్నది. ఈ పరిస్థితికి ప్రధానకారణం ప్రభుత్వ విధానాల లోపవే. బోయిజంగయ్య "ఇప్పపూలు" కథ ఈ విషయాన్నే చిత్రించింది. సమ్మెట ఉమాదేవి "అస్తిత్వం" అనే కథరాసింది. బడిలో గిరిజనుల అసలు పేరుకు బదులు, వేరే పేరు పెట్టి తరగతిలో చేర్చు కోవడం కథలో కనపడుతుంది. అన్నిలాల్ అనే అసలు పేరుకు బదులు అనిల్‌కుమార్ అనిపేరు పెట్టడం, ఇంకా చాలా మందికి పేర్లు మార్చి బడిలో చేర్చుకోవడం జరుగుతుంది. "దాటోడి" అనే గిరిజన స్థానిక పండగకు సెలవు అడిగితే ఇవ్వకపోవడం ప్రశ్నార్థకమైతది. వీటన్నిటి వల్ల మా అస్తిత్వం కనుమరుగువుతుంది. అనే బాధ గిరిజనుల్లో కలుగుతుంది. తమ భాష బడిలో నేర్చుకోక పోవటం వల్ల కూడా వెనకబాటుకు కారణ మవుతుందనే భావన కథ ద్వారా తెలుస్తుంది. గిరిజన ఆచార వ్యవహారాలకు వచ్చిన గండం, రోజు రోజుకు అవి పాతకాలపువి అవడం ఒక వివాదం. వాటికి బదులుగా గిరిజనుల్లో కొత్త పద్ధతులు వచ్చి చేరడం వల్ల, నిజమైన గిరిజన సంస్కృతి కొడిగట్టుకుపోతుందని పద్దం అనసూయ తన కథల్లో అభిప్రాయపడింది. "కాకమ్మ" అనే కథలో గిరిజన పెళ్ళి తంతుకు బదులుగా వేరే మతం పద్ధతులు వచ్చి చేరడం కనిపిస్తుంది. ప్రతీ విషయంలో ఆధునికం పేర, ఇతర సంస్కృతి గిరిజనల్లోకి చొచ్చుకు వస్తుందనీ, దాని వల్ల గిరిజన అస్తిత్వం దెబ్బతింటున్నదని రచయిత్రి అభిప్రాయపడుతుంది.

బ్రిటీష్ వారి అటవీ చట్టాలు, నిజాం అటవీ విధానం, 1/70 చట్టం, నాగరీకుల పోకడలు, గిరిజనుల అమాయకత్వం, ఫారెస్టు డిపార్ట్‌మెంట్ చర్యలు ఇంకా అనేక విధానాల వల్ల లాభపడ్డది గిరిజనేతరులే కాని గిరిజనులుకాదు అనేది చారిత్రక నిజం. అందుకు కొమురం భీం పోరాటం, అడవుల్లోని విప్లవోద్యమం, మైదాన ప్రాంత షావుకార్లు, విద్యావంతులు, వడ్డీ వ్యాపారులు, కంట్రాక్టర్లు, అధికారులు సాక్షులుగా కనిపిస్తరు. చదువు వల్ల వచ్చిన అలవాట్లు, భాష, ఆచరణలు గిరిజనుల్ని తమ స్వంత సంప్రదాయాల నుండి దూరంగా తీసుకెళ్తున్నది. దాని వల్ల సొంత సంస్కృతికి పరాయి అవుతున్నారు. ప్రాజెక్టుల వల్ల అటవీ ప్రాంతం ముంపుకు గురవుతున్నది. వాళు ఌ అడవికే దూరం కావాల్సి వస్తున్నది. ఇవన్ని గిరిజన జీవన వెతలు. తెలంగాణ కథ ఈ విషయాల్ని చిత్రించింది.



**-బి.వి.యన్.స్వామి**
సెల్: 9247 817732

## నేటి నిజాలు




## కనిపించే దేవుళ్ళు

మొగ్గ తొడిగింది
పూవు విరిసింది
పరిమళం వెదజల్లింది
మకరందం పంచింది
బంధాలు ఏర్పరిచింది
బంధుత్వాలు పెంచింది
ఆ బంధాలకు రెక్కలొచ్చాయి
బంధుత్వాలు దూరమయ్యాయి
చుట్టుముట్టాయి
చరమాంకాపు సుడిగుండాలు
పిడిసిన గుడ్డలా
ముడతలదేరిన ముఖం
శక్తులుడిగిన శరీరం
కమ్ముకొన్నాయి
నిర్లక్ష్యపు నీలి మేఘాలు
కన్నవారు కానరారు
ఉద్యోగం ఉపాధి కోసం
పల్లెలు వదిలారు
పట్నాలకేగారు
దేశాన్ని విడిచారు ఖండాలు దాటారు
ఒంటరైన వార్ధక్యపు బతుకులు
మబ్బు పట్టాయి
మసక బారాయి
వృద్ధ జంబుకాలగా మిగిలిపోయాయి
గుండె పిండగుతోంది
పేగు కదులుతోంది
కన్ను చెమ్మగిల్లుతోంది
గతవైభవం కరిగిపోయింది
ముసలితనం ఓ శాపంగా మిగిలిపోయింది
బతుకు పోరాటం ఆగిపోయింది!

**-వావిలిపల్లి రాజారావు**
9963606391

## హస్తిని హత్య

ఏనుగు మరణించింది
జంతువుల పట్ల ప్రేమ మరణించింది
రెండు ప్రాణాలు, రెండు హత్యలు
తినాలని కోరిక చూలాలుకున్నట్లు
అనాసపై మనసు పారేసు కొంది
తినాలనే ఉబలాటలో
ఊపిరి తీసుకొంది
సాదు జంతువు
పెంపుడు జంతువు యుద్ధాల్లో
పెద్ద పెద్ద బరువులు మోయడంలో
దేవుడు రథాలు లాగడం లో
రాజుల అంబారిగా మారి ఊరేగడంలో
అన్ని రకాలుగా తోడుగా ఉండే ప్రాణి
కనిపించి కనువిందులు చేసె
సర్కస్‌లోని మహాప్రాణి
పూజలు అందుకొనె దేవతా
ఎంత దయనీయంగ
ఎంత హీనంగా
చేపకు ఎరవేసి నట్లు
అనాసలో పేలుడు మందా!
తినేకూటి లో విషమా!
నోట్లోపేలిన టపాకాయలకు
రక్తం కారుతూ ఈగలు ముసురుతూ
లోపల కాలిన గాయాల మంటలు
భరించ లేక నీటి గుంటలోనే
ప్రాణాలు వదిలింది
ఈ పాపానికి వడగట్టింది
ఎవరు?
ఏజాతి వాడు
హంతక జాతివాడా
నరరూప క్రూరమృగమా
అలాంటి వాడే
అలాంటి ద్రోహే
మానవజన్మ సార్ధకం చేసుకోలేని వాడు
మనిషి అనబడే రక్తపింజర
ఎన్ని చెవులు
ఎన్ని కన్నులు
దాని బాధ వారు పడుతున్నట్లు
దాని తెలియని వేదన తామె అనుభవిస్తున్నట్లు
మనసు మనసు లోఊరడించు కొంటున
వాళ్లు మనషులు
వీళ్లు మనషులా కాదు కాదు
వన్యప్రాణుల హంతకులు వీరిని ఉరితీయాలి
సమాజంలో సామజం విలువలు తెలియ చేయాలి



**-రేడియమ్**
9291527757

## రెప్పపాటు ఆనందం

అక్షరం అంటే
నా భావనలో
ఒక పరిమళించే పువ్వు
నేను నిత్యం అక్షరాల తోటలో
విహరిస్తూ వుంటాను
నిజానికి నేనొక
అక్షరాల పూజారిని
చదువులమ్మకు
అక్షరాల పూలతోనే మాలలల్లుతాను
బహుశ
ఆమె అనుగ్రహించదలచినట్టుంది
నా చెవులకు
ఆమె అమృత వాక్కులు ఉపదేశిస్తోంది
తల్లి చెప్పే ఆ మాటలను
నా కలం
పుటలు పుటలుగా నింపుతోంది
అది పద్యాలో, గేయాలో
నా ఊహ కూడా తేల్చి చెప్పలేని
వచన రచనలో, ఏమీ తెలియటం లేదు
మురిసిపోతున్న చేతి వేళ్ళ మధ్య
కలం ఆశువేగంతో కదిలిపోతున్నది
ఒక మహాగ్రంథమేదో
అప్పటిప్పుడే సిద్ధమైపోయింది
ఒళ్ళంతా
పులకరింపులు ప్రవహిస్తున్నాయి
కుదురుగా లేని శరీరం
కాస్త పక్కకు ఒత్తిగిల్లింది
ఇంకేముంది? రెప్పపాటు చెదిరింది
పరుగులెత్తే వేళ్ళు కాదు
తిమ్మిరెక్కిన కాలు దర్శనమిస్తోంది
అక్కడ కలమూలేదు,
కావ్యమూ లేదు
చదువుల తల్లి జాడా లేదు
నన్ను కాసేపు కవిగా మలచిన ఆ కల
ఇప్పుడు కరిగిపోయింది.



**- మద్దాళి రఘురాం**
9866057777

## కణిక



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా'

**పోటీ ఫలితాలు**

నిర్వహణ: *డా॥ప్రతికంఠం మాలతీలత*

ఈ సమూహంలో చేరదలచినవారు
8985613123కి మెసేజ్ చేయవచ్చు.

**ప్రథమ బహుమతి విజేత**

### శీర్షిక: ఆటుపోటులు..

నింగీ నేలా కలిసినట్లుండే..
అందమైన సాగర తీరం..
సంధ్యా కాంతులతో..
జతకట్టి..
కెంజాయి వర్ణపు సూరీడు
నుదిటిపై సింధూరమవ్వగా..
అలసి సొలసిన ఆర్కుడు..
కొండలనడుమ పుడమితల్లి
ఒడిలోకి జారుతున్న దృశ్యం..
ఆకసానికి వింత శోభలను
చేకూర్చగా..
ఆహ్లాదకర వాతావరణం..
వలపు సంకెల వేసి..
మలయ మారుతాలతో ..
మదిని పులకరింప చేసే
పిల్ల తెమ్మెరలు..
నీ తలపుల ద్వీపంలో చిక్కుకున్న నా మది
నీ జ్ఞాపకాల తెరలను దించి..
ఊహల వాయువులు..
మది సంద్రంలో అలజడులై..
అల్ప పీడనాన్ని సృష్టిస్తూంటే..
నెమ్మది నెమ్మదిగా..
నిశీధులు ఆవరించే వేళ
నీలి వెన్నెల జాబిలి. ..
నిండు ముత్తయిదువగా
ఏతెంచి..
జగతిని అలరించు వేళ..
అమావాస్య పౌర్ణమిల
ఆటు పోటులలో..
పున్నమి వెన్నెలకు ప్రశాంతమై..
మదిలోని దిగులు మేఘాలను
కరిగిస్తూండగా..
జీవితంలో పూచే వెన్నెల
వెలుగులకైవేచి చూస్తోంది..
శ్రీ నీడలలో నైనా..
నా వెంట నీవొస్తావని..



**-పోపూరి మాధవీలత**

**ద్వితీయ బహుమతి విజేత**

### శీర్షిక: ఉషోదయ త్రిల్లిక

ఓ ..ఓహో..రాగవల్లిక అనురాగ మల్లిక
ఉషోదయ త్రిల్లిక
మంజూష మయురా నృత్య వాటిక
జనహిత జంఝూ మారుత పేటిక
నవ నవోన్మేష నవజాత పొలికేక.
అందాకార బంధురా చిందర చిద్విలాస హసిక
రావే నా హృదిలో
నీలి వెన్నెల జాబిలి ముత్తైదువగా
మురిసినవేళ
జవరాలి హ్వాయల మనస్సులు
ఆకాశపుటంచులు దాటేవేళ.
పల్లెల సిరులు ముసిముసిగా
ముచ్చటలై పలికిన వేళ.
వాకిట పంచ వన్నెల
ముగ్గులీనుతున్న.
హాసిత నా చెలికి
కేంజాయవర్ణపు సూరీడు
నుదిటి పై సింధూరమవ్వగా
చల్లని పిల్లగాలులు వినసకట్లలై వీయగా.
వాకిలి లోగిలి సరిగమలై
పరమ శోభిత గోధూళి గంధ వర్ణమై.
కొలిచెనమ్మా బడుగు జీవి
బాధలు వెడలగా....
నిలిచెనమ్మా భువిలో ప్రకృతి మాత..



**-కె.గోపాల్ జి**
9441365393

## జ్ఞాన కణిక రగిలిద్దాం

బాలలేగాని బలహీనులుగాదు,
భావి భారత ఉక్కుస్తంభాలు వారు.
వసివాడని మొగ్గలే గానీ,
రేపటి పరిమళ కుసుమాలు వారు.

స్వచ్ఛమైన మనసుతో
శాంతికి రూపాలు వారు,
కల్లాకపట మెరుగని
అనురాగ దీపాలు వారు.
ప్రేమకు ప్రతిరూపమై
భువిన వెలసిన దేవతలు వారు.

వేదాలకు మెరుగులద్ది ,
శాస్త్రాలకు సొబగులిచ్చి,
బంగరు జాతిని మలిచే
రేపటి శిల్పులు వారు.

బాలలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం.
వారి భవితను అందంగా మలచుదాం.

లేతమనసుల్లో జ్ఞానకణిక రగిలిద్దాం.
భరతజాతి కీర్తిదీప్తి విశ్వమెల్ల చాటుదాం.



**-ఎస్. మోహన్ గౌడ్**
9440464503

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 'బాల్యం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'బాల్యం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..** – సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,** *9441046839*

## ఆ రోజులు జ్ఞాపకమే..

ఆ రోజులు మరిచిపోలేనివి
గుర్తొచ్చిన ప్రతీసారి
అప్పటి జ్ఞాపకాలలో తిరిగి తిరిగి అలసిపోతాను..

ఇసుకగూళ్లు కట్టి
మురిసిపోయిన క్షణాలు
కాసపుల్ల ఆటలో గెలిచిన ఆనందం..
రేగుచెట్టు దులిపిన సంబరం..
చింతచెట్టకు కట్టి ఊయలలో
నిదుర జ్ఞాపకమే..

వీధి పిల్లలతో చేరి
వీరీ వీరీ గుమ్మడి ఆట పాటా..
ఓమన గుంటల్లో పొందిన
చింతపిక్కల సంతోషం..
బొమ్మరిల్లు కట్టి
గురుగులల్లో బువ్వ...
అన్నీ జ్ఞాపకమే...

అమ్మతోడు
దేవుడి మీద ఒట్టు అంటూ..
అమాయకమైన మాటలతో
అలిగిన వేళ
బుంగమూతిని బుజ్జగించగవచ్చే
నాయనమ్మ...
ఆమె మెట్టల చప్పుడు ఇంకా జ్ఞాపకమే...
పొలం గట్లపై నడుస్తు
జారిన అడుగులకు..
బురదైన ఒంటిని కడుగుతు
అమ్మపెట్టిన చీవాట్లు జ్ఞాపకమే...

చీకటేల చిన్నత్త చెప్పిన
దయ్యం కథ..
ఎంతెగిరినా అందని ఉట్టి..
ఆకాశంలో నిలిచి జారిపడని చుక్కలు చూస్తూ ..
మెల్లగా నిద్రలోకి జారుకున్న
చిన్ననాటి ఎన్నెన్నో జ్ఞాపకాల
బాల్యం జ్ఞాపకమే...

**-శ్రీలత రమేశ్ గోస్కుల**
7013943368

## బాల్యం అమూల్యం - చేయొద్దు మాలిన్యం

బాల్యం అమూల్యం
చేయొద్దు మాలిన్యం
మాలిన్య కారకులపై
వహిద్దాం కాఠిన్యం
బాల్యం భవిష్యత్తును
చేద్దాం ఉజ్వలం
అందుకు సహకరించుకోవాలి అందరం
నేటి బాలలే రేపటి పౌరులు
బాలలే భారత భాగ్య విధాతలు
నినాదాల నిగ్గు తేలుద్దాం
ప్రమాదాలనుండి పరిరక్షిద్దాం
అందమైన బాల్యానికి
అర్థాంతరంగా ప్రమోషనిచ్చి
బరువు బాధ్యతలప్పగించి
బాలల హక్కులకు
భంగం కలుగజేస్తున్న
శక్తులపై పరిస్థితులపై
పోరాటం చేద్దాం
కష్టపు బాల్యానికి కారణం
లేమి కుటుంబంలో పుట్టడం
లేమి కుటుంబాలకు కారణం
స్వతంత్రానికి అర్థం లేకపోవడం.
బాల్యం అమూల్యం - చేయొద్దు మాలిన్యం

**-అరుణజ్యోతి**
9966181561





## మధురానుభూతి

బాల్యం మధురమైన అనుభూతి
మరల రాని మధుర స్మృతి
ఇంటి బయట ఆట
మదిలో అమ్మ పాడే పాట
నాన్న పైన గుర్రపు సవారీ
మధురం సుమధురం
మరిచిపోలేని జీవిత పయనం
తాతా నానమ్మల
చందమామ కథలు
దూరదర్శన్ రామాయణ మహాభారతాలు
బాల్యంలోని తెలుసుకున్న నీతి మాటలు
మధురమైన జ్ఞాపకాలతో
ప్రతి అడుగులో గుర్తొచ్చే స్నేహితులు

తరగతి గదులు
అల్లరితో ఆకతాయి పనులు
ఉపాధ్యాయుల రాకతో నిశ్శబ్దం
అమ్మ వేసే రెండు జడలు
మళ్లీ మళ్లీ కొట్టే గంటలు
నేను నడిచిన పూల బాటలు

నేటి బాలలే రేపటి పౌరులు
వెలిగే దీపాలు
మర్చిపోలేని బాల్యం
తిరిగిరాని ఆ సమయం
బాల్యంలో ఉన్న మహత్యం

**- రజని కులకర్ణి**
9296450010

తండ్రి పడే కష్టం
తల్లి పడే దుఃఖం
చిన్ని మనసుకు
అంటని చిన్నారి బాల్యం!!.
ఆకలేస్తే అడగటం
పెట్టింది తిని
ఆటలాడటం
చదువుకోవడం
కంటి నిండా నిద్రపోవడం!!.
పెరిగి పెద్ద అయ్యాక
జీవితంలో ఎన్ని సవాళ్లు
జీవన గమనంలో
ఎన్ని అవరోధాలు!!....
ఇవేవీ పట్టని
ఏ బాదరబందీ లేని
అందమైన బాల్యం
అవును!
బాల్యమెంతో మధురం!!



**-పీవీ సత్యమూర్తి**
9440720324

పెద్దయ్యాక ఎలా పంచుకొని
పెంచుతామో తెలువదు.
పండగ అంటే
పప్పూ బెల్లాలూ అన్నమూ అప్పాలూ
దేవుణ్ణి కోరికలు అడగాలనీ తెలువదు.
కల్మషం తెలువదు
చెడు స్నేహం తెలువదు
సోపతి తెలుసు
పాస్ ఫెయిల్ తెలుసు
ర్యాంకులుంటాయని తెలువదు
సర్కార్ బడి తెలుసు
కానిగిరి బడి తెలువదు
అబద్ధాలు ఆడుతారని తెలుసు
మోసమంటే తెలువదు
మనుషుల పేర్లు తెలుసు
వాళ్ళ గుణాలు తెలువదు
మనుషులే తెలుసు
అమానుషత్వం తెలువదు.
సార్ అంటే తెలుసు
కీచక సార్లు ఉంటారని తెలువదు
చాకోలెట్ ఇస్తే తింటానని తెలుసు
వారిలో చంపే మృగాలుంటాయని తెలువదు.
కాలంలో ఎన్నో మార్పులు
జీవన శైలి లో మార్పులు
బాల్యజీవితంలో మార్పులు
బాదరబందీ లేని బాల్యం
బండమీదైనా
కంటి నిండా కలతలు లేని
నిద్ర పట్టే జీవితం.
ఉమ్మడి కుటుంబాలు కరువై
నేటి బాల్యం అవుతోంది బందిఖానా
మంచి చెడు తెలువని బాల్యం
బద్దలు కాకుండా చేసే బాధ్యత అందరిది .

**- డా. భూంపల్లి కేశవ రెడ్డి**
9848473099



## భరతమాత బిడ్డ

చిన్ని చిన్ని అడుగులతో
తేనెలూరు పలుకులతో

ఎండిపోయినట్టిలోకమును పండించావే
సూటిపోటి ప్రశ్నలతో
ముచ్చటైన ముచ్చటతో
కష్టమైనా ఇష్టమైన పరిక్ష పెట్టావే

కొత్త కొత్త ఊహలతో
పెద్ద కళ్ళ లోతులలో
భూమినే మార్చగలుగు ప్రతిభ చూపావే

నవ్వుల పూవులతో
కేరింతల వెన్నెలలో
జీవితమే స్వర్గమన్న నిజము చెప్పావే

రేపు నువ్వు వైద్యుడవో సైనికుడవో శాస్త్రవేత్తవో
విద్యనిచ్చు గురువో ముద్దపెట్టు రైతువో
రేపు నువ్వు రాజకీయనాయకుడవొ మంత్రివో యెవరో
పెరిగి పోయి ప్రేమించెడి నాన్నవో అమ్మవో
నేడైనా రేపైనా ఎప్పుడైనా
నువ్వు భరతమాత వొడిలో తన రుణము తీర్చు బిడ్డవు

**-ఆదిపూడి రోహిత్ శర్మ**
+1(818)835-7381

## కంటి వెలుగు

కం. పిల్లలు దైవ సమానులు
కల్లా కపట మెరుగనియు కలలగు వారున్!
తల్లుల కంటి వెలుగులును
మల్లెలు వారి మది జూడ బాల్యము మోదమ్!

ఆ.వె. ఆట పాట వయసు నమ్మలాలనలోన
తోటి బాలలంత తోడుగాను
వచ్చిరాని మాట పలకబంగారమే
తప్పటడుగు వేయ తల్లి మురియు!

కం. మర్మమెరుగని మనుజులను
ధర్మమిదేమని యడుగగ ధైర్యము లేకన్!
ఓర్మితొ బాల్యము దెలుపగ
కర్మయె పెద్దల మనసులు కల్మష మవ్వన్!

**-ధర్మపురి వేంకటేశ్వర్లు,**
98666 45822

## అందమైన బాల్యం

అందమైన బాల్యం
చీకూ చింతా లేని బాల్యం
ఏ కష్ట నష్టాలు తెలియకుండా
ఆనందంతో తుళ్ళుతూ
ఆడుతూ పాడుతూ
హాయిగా గంతులేసే బాల్యం!!.
కల్మషం ఎరుగని నవ్వులు
కులమతాలు కుమ్ములాటలు
తెలియని బాల్యం!!.
అమ్మ ప్రేమగా పెట్టిన రెండు ముద్దలు
నోట్లో వేసుకుని ఆటలకై పరుగులు
కబడ్డీ గిల్లిదండూ గోళీకాయలూ
అష్టాచమ్మా వామనగుంటలూ
ఒకటేమిటి ఎన్నో....ఎన్నెన్నో ఆటలు!!.
చిన్నతనంలో
ఆటలతో పాటు అడవి
పాశం బండకు పోయి
మోదుగాకులూ రేగు పళ్లూ
కోసుకొచ్చిన జ్ఞాపకాలు!!.
బాల్యమంతా ఒకటే ధ్యాస...
స్నేహితులూ ఆటలూ చదువులూ

## ఏమీ తెలియని తనం



బాల్యం బహు బాగు
అమ్మే దేవత
నాన్నే దేవుడు
ఇల్లే స్వర్గం
ఊరే మనది.
నాన్న వెంట నడిచి
అమ్మ వంట తిన్న జీవితం.
అమ్మ ఒడి
తరువాత బడి
గురువంటే భయం
పెద్దలంటే గౌరవం
అమ్మానాన్నలే ఆదర్శం
ఆటపాటల ఆనందం .
తెలిసిందల్లా
ఇల్లూ బడీ
అమ్మానాన్నా చేసేపనులు
ఆటలూ చదువులూ
అన్నదమ్ముల ధైర్యం
అక్కచెల్లెల్ల ఆప్యాయత
అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్యల గారాబాలు.
చుట్టాలూ పక్కాల పలకరింపులు
తోటిపిల్లలతో ఆటలు
ఇదే లోకం
ఇదే స్వర్గం.
ఆవేదనా ఆందోళనా తెలువదు
ఆశలూ ఆశయాలూ ఆస్తులూ అంతస్తులూ
సుఖమూ దుఃఖమూ కష్టాలూ నష్టాలూ.
బాదరబందీలు చీకూ చింతలూ
ఏవీ తెలువదు.
లోకం పోకడ తెలువని జీవితానికి
బాధ్యతా తెలువదు
అన్నీ అమ్మానాన్నలకే తెలుసు
అడిగింది ఇవ్వకుంటే ఏడుపొక్కటే తెలుసు.
బాల్యంలో అమ్మానాన్నలు
అందరిని ఒకేలా చూస్తారని తెలుసు

## తిరిగిరానిది బాల్యం

బాల్యమంటే
మరుపురాని
మధుర స్మృతులు
బాల్యమంటే
బంగారం కన్నావిలువ
బంగారాన్ని
ఎంతైనా ఎలాగైనా కొనుక్కోవచ్చు
బాల్యాన్ని మాత్రం
ఇసుమంతైనా కొనుక్కోలేం
చెదిరిన బాల్యపు తీపి గుర్తులే
నేటి ప్రవృత్తికి నిదర్శనం

అమ్మ చేతి గోరుముద్దల
అపురూప బాల్యం
నాన్న వేలు పట్టుకు నడిచిన
బుడిబుడి నడకల బాల్యం
అన్నను హత్తుకున్న
ఆప్యాయతల బాల్యం
అక్కతో దాగుడుమూతలాడిన
అనురాగ బాల్యం
చెల్లితో చిలుకపలుకుల
మురిపాల బాల్యం
తమ్ముడితో తగువులాటల
తన్మయత్వాల బాల్యం
అన్నీ మధుర నవనవోన్మేష
పులకరింతల బాల్యస్మృతులు.
ఆడని ఆటలు లేవు
చెప్పని ముచ్చట్లులేవు
ఇపుడేవి ఆ ఆటలు
ఎక్కడున్నాయి ఆ సందడులు
చిలిపి తనపు చిల్లర చేష్టలు
బాల్యం మరల వస్తే బాగుండునని
మది ఆరాటపడుతుంది
తిరిగిరానిది బాల్యమని తెలిసినా
ఏదో వెర్రి ఆశ
మది అంతరాల దొంతరలో
దాగిన పెన్నిధి బాల్యం

**- పురం మంగ**
9440659444

## నా చిన్నప్పుడు

నా చిన్నప్పుడు
అమ్మని విడిచి పోలేదెన్నడు
నాన్న అంటే భయమూ భక్తీ
ఎన్నో విషయాలు చెప్పే నాన్నమ్మ
జ్వరం వస్తే నా వైద్యురాలు
నాకు గాలి సోకద్దని
కాలికి బేడి నల్ల గొంగడిదారం
మెడలో తాయత్తు
బడికి తీసుకుపోయే వీరయ్య
నాన్న వాళ్ల బడి అటెండర్
ఊళ్లో పిల్లలందరూ
మా ఇంట్లోనే ఎందుకో.
సాయంత్రం
పశుల కాపరులు
అడవి లోని
ఫలాలూ కూరలూ కాయలూ
ఇచ్చేవారు
ఆడించేవారు.
అదొక పల్లెటూరు
అక్కడ మా నాన్న పంతులు
ఆప్యాయతలు ఆదరణకు
ఆనవాళ్లు ఆ పల్లెలు
నా చదువు నగరానికి వెళ్ళినా
పల్లెను వీడలేదెప్పుడూ
వారికి గురువు నై విద్య నేర్పిన
భాగోతుల పాటలు నేర్పిన
నా తెలివితో కొంత మార్చిన
ఆ పల్లె లో మరచిపోలేని గుర్తులెన్నో
తలారోల్ల చేనూ సాగూ
వాగులూ వంకలూ
బుడియోనికుంట
చెట్ల ఊయలలు
మందకాడ గోటీల ఆటలు
ఈతాజున్నా మొర్రి పండ్లూ
చెరుకు గడలూ .. అబ్బా ఎన్నో
ఇలా చెప్పుకొంటే
తనివి తీరదు
కోరిక చిక్కదు
మరువని నా బాల్యం
దర్పణంలో చూసుకుంటున్న

**-జి.కొండల్ రావు**
9705965172

## నాటి సభలు, సమావేశాలు...
నవంబర్ 12 నుండి నవంబర్ 18 వరకు

### నవంబర్ 13
జ్ఞాపకాలు




నవంబర్ 13, 2016న త్యాగరాయ గానసభలో “తెలుగు సాహిత్య కళాపీఠం” పంచమ వార్షికోత్సవంలో చికప్ప రామదాసు, గోరటి వెంకన్నలను సత్కరిస్తున్న కె. నర్సింహాగౌడ్, బైస దేవదాసు, మెజిస్ట్రేట్ బూర్గుల మధుసూదన్, డా॥ తిరునగరి, డా॥ ఈటెల సమ్మన్న.




సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

### నవంబర్ 14
జ్ఞాపకాలు



నవంబర్ 14, 2013న కళాసుబ్బారావు కళావేదిక, హైదరాబాద్‌లో ఆకెళ్ళ అసోసియేషన్, త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో శ్రీమతి ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి రచించిన “అక్షింతలు” కథానికల సంపుటి ఆవిష్కరణ సభలో శ్రీ సాధన నరసింహాచార్య, డా॥ కళా వేంకట దీక్షితులు, ముఖ్య అతిథి ఆవిష్కర్త తెలుగు అకాడమీ సంచాలకులు ఆచార్య కె.యాదగిరి, విశిష్ట అతిథి బైస దేవదాసు, డా॥పోతుకూచి సాంబశివరావు, వాసా ప్రభావతి, రచయిత్రి ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి, ఎ.సుబ్బారావు, పోలాప్రగడ కాజ్యలక్ష్మి, హేమలత.




నవంబర్ 14, 2016న “ఉపనిషత్ సప్తాహం”లో ప్రసంగిస్తున్న ఆచార్య మసన చెన్నప్ప. వేదికపై డా॥తెన్నేటి సుధాదేవి, వంశీ రామరాజు, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ కళా వేంకట దీక్షితులు.

### నవంబర్ 15 & 16
జ్ఞాపకాలు



నవంబర్ 11, 2019న కళా సుబ్బారావు కళావేదికలో జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు “అభినందన ప్రతిభానగదు పురస్కారం” ప్రదానం చేస్తున్న పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, గాయని భూదేవి, సయ్యద్ జహీర్ అహ్మద్, వి.వి. రాఘవరెడ్డి, లంక ఫణీకుమార్ శర్మ, లయన్ డా॥ చిల్లా రాజశేఖర రెడ్డి, సయ్యద్ జానీభాషా, గుడిబండి వెంకటరెడ్డి.



నవంబర్ 16, 2014న త్యాగరాయ గానసభలో “తెలుగు సాహిత్య కళాపీఠం” తృతీయ వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు ఆచార్య మసన చెన్నప్ప, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, మెజిస్ట్రేట్ బి. మధుసూదన్‌లతో పురస్కార గ్రహీతలు.

### నవంబర్ 17
జ్ఞాపకాలు



నవంబర్ 17, 2004న సినారె నివాసంలో నేటినిజం దీపావళి ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో డా॥పోతుకూచి సాంబశివరావు, ఆవిష్కర్త డా॥సినారె, బైస దేవదాసు, వీణాదాసు, సూరజ్.



నవంబర్ 17, 2004న డా॥సినారె నివాసంలో...

### నవంబర్ 17
జ్ఞాపకాలు




నవంబర్ 17, 2018న కళాసుబ్బారావు కళావేదికలో శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య 2018న సంవత్సర కవితల పోటీలోని విజేతలతో అతిథులు శ్రీమతి భాను, పి. విజయలక్ష్మి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ టి. గౌరీశంకర్, డా॥పోలేటి పార్వతీశం, డా॥ఎన్.ఆర్.కె.రెడ్డి, ఎల్.ఆర్. వెంకటరమణ, ఎల్వీ సుబ్రహ్మణ్యం.




సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

### నవంబర్ 18
జ్ఞాపకాలు



నవంబర్ 17, 2018న కళాసుబ్బారావు కళావేదికలో శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య 2018న సంవత్సర కవితల పోటీలోని విజేతలతో అతిథులు శ్రీమతి భాను, పి. విజయలక్ష్మి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ టి. గౌరీశంకర్, డా॥పోలేటి పార్వతీశం, డా॥ఎన్.ఆర్.కె.రెడ్డి, ఎల్.ఆర్. వెంకటరమణ, ఎల్వీ సుబ్రహ్మణ్యం.



నవంబర్ 18, 2009న పిఠాపురంలో ఆవంత్స సోమసుందరం 86వ జన్మదినోత్సవంలో పత్రికా నిర్వహణలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు ‘ప్రతిభా పురస్కారం’ ప్రదానం చేస్తున్న డా॥ ఆవంత్స సోమసుందరం.

### నవంబర్ 18
జ్ఞాపకాలు




నవంబర్ 18, 2018న తెలుగు సాహిత్య కళాపీఠం సప్తమ వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు. వేదికపై డా॥నాళేశ్వరం శంకరం, డా॥ తిరునగరి, డా॥ వద్దేపల్లి కృష్ణ, డా॥ ఈటెల సమ్మన్న, న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్, చిక్కా రామదాసు.



నవంబర్ 18, 2018న రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో తెలుగు సాహిత్య కళాపీఠం సప్తమ వార్షికోత్సవ వేడుకల్లో నేటినిజం సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న వనమాల చంద్రమౌళి, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ తిరునగరి, మెజిస్ట్రేట్ బూర్గుల మదుసూధన్, డా॥ ఈటెల సమ్మన్న, డా॥ వద్దేపల్లి కృష్ణ తదితరులు.

### నవంబర్ 18
జ్ఞాపకాలు



నవంబర్ 18, 2017న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో “చదువులా? చావులా?” అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న బైస దేవదాసు. వేదికపై శ్రీమతి మెర్సి మార్గరేట్, భూపతి, ఏ. మోహనకృష్ణ, టి. శరత్‌చంద్ర.



నవంబర్ 18, 2017న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చదువులా? చావులా? అంశంపై జరిగిన కవి సమ్మేళనంలో కవులతో అతిథులు మెర్సి మార్గరేట్, ఎ. మోహనకృష్ణ, ముఖ్య అతిథి నేటినిజం దినపత్రంక సంపాదకులు బైసదేవదాసు, టి. శరత్‌చంద్ర, భూపతి, టి.చక్రవర్తి.

# ఎన్నికలపై కాదు...సమస్యలపై దృష్టి పెట్టాలి !

హైదరాబాద్, నవంబర్ 18:గ్రేటర్ ఎన్నికల నగారా మోగింది. ప్రభుత్వం దృష్టి అంతా ఇప్పుడు ఎన్నికల్లో గెలవడంపైనే ఉంది. గ్రేటర్ వ్యూహాలపైనే నేతలు దృష్టి సారించారు. అభ్యర్థుల ఎంపిక, గెలవడం ఇవే ఇప్పుడు అధికార టిఆర్ఎస్ ముందున్న లక్ష్యం. ఇప్పటికే నగరంలో వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫల మయ్యింది. సాయం అందని వారు దరఖాస్తు చేసుకోవాలంటూ మంత్రి కెటిఆర్ చేసిన ప్రకటనతో గత నాలుగైదు రోజులుగా మీ సేవా కేంద్రాల వద్ద వేలాదిగా ప్రజలు క్యూలు కట్టారు. పనులు వదులుకుని ఉదయాన్నే సెంటర్లకు చేరుకుని సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు బారులు తీరుతున్నారు. అయినా వీరిని ఏ ఒక్క నాయకుడు కూడా పలకరించడం కానీ... పట్టించుకోవడం కానీ జరగడం లేదు. హైదరాబాద్ పరిస్థితి ఇలావుంటే గ్రామాల్లో రైతుల పరిస్థితి మరోలా ఉంది. నియంత్రిత సాగులో భాగంగా సన్నాలు పండించిన రైతులు వివిధ జిల్లాల్లో గిట్టుబాటు ధరలకోసం రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. అయినా ఓమంత్రి కానీ, ఎమ్మెల్యే కానీ వారి వద్దకు వెళ్లి ఓదార్చి..ధరలు ఇప్పించే ప్రయత్నాం చేస్తామని చెప్పడం లేదు. నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలను ఆదుకోవడంలో నిజానికి మీనమేషాలు లెక్కించరాదు. తాయిలాలు ప్రకటించే బదులు సమస్య వచ్చినప్పుడు పరిష్కరించడం ఉదాత్త లక్షణం. పాలకుల లక్ష్యం కూడా అదే కావాలి. ప్రత్యేక తెలంగాణలో ఇవి జరుగుతాయని భావించిన ప్రజలకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఓట్ల కోసం చూసుకోకుండా కష్ట సమయంలో అందరినీ సమానంగా ఆదుకోవాలి. అందుకు వెనకాడడంలో అర్థంలేదు. సిటీలో వరదలతో ఇబ్బందిపడిన ప్రతి ఒక్కరితో పాటూ పంట నష్ట పోయిన ప్రతి రైతుకు పూర్తి పరిహారం ఇవ్వాలి. సన్నాలను మద్దతు ధరలకు కొనడంతో పాటు...వర్షాలకు తడిచి న పంటలను ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనాలి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మిల్లర్లకు ఉపయోగపడేలా ఉన్నాయి. దీంతో సన్నాలు పండించిన రైతులు మిల్లర్లకు తక్కువధరలకు ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు. వారంతా ధాన్యం అమ్ముకున్నాక గానీ ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించే పరిస్థితి కానరావడం లేదు. సమగ్ర వ్యవసాయ విధానం రూపొందించి, దానిని అమలు చేసి ఉంటే ఇలాంటి దుస్థితి వచ్చి ఉండేది కాదు. రైతుబంధు రాదనే బెదిరింపులకు పాల్పడి రైతులతో సన్నాలు తదితర పంటలు వేయించిన ప్రభుత్వం, దిగుబడుల వచ్చే సరికి చేతులు ఎత్తేసింది. అయితే అకాల వర్షాల వల్ల 90 లక్షల ఎకరాలు మునిగిపోతే ఇంతవరకు తగిన పరిహారం ప్రకటించకపోవటం ఎలాంటి రైతు రాజ్యం నడుస్తుందో పాలకులు చెప్పాలి. కేంద్రం ఇచ్చిన జీవో ప్రకారం.. ఎకరాకు రూ.15 వేల సాయం చేసే చాన్స్ ఉన్నా పట్టించుకోలేదు. అలాగే పౌల్ట్రీలు, గొర్రెలు, మేకలు, మత్స్యసంపద వంటి వాటి నష్టానికి కూడా రూ.30 వేలు ఇచ్చే అవకాశం ఉన్నా వాడుకోలేదు. కేంద్ర విపత్తుల శాఖ నుంచి సహాయంగా వేలాది కోట్లను తీసుకునే వీలున్నా.. సరైన కార్యాచరణ ప్రణాళిక లేకపోవడంతో ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేంద్ర సాయం ద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను గట్టెక్కించే అవకాశంపై అవగాహన లేని అధికారుల తీరు కారణంగా సరైన సలహాలు ఇవ్వడం లేదన్నది పరిస్థితులను బట్టి తెలుసుకోవచ్చు. వరద సాయానికి సంబంధించి సమగ్ర నివేదిక రాలేదని స్వయంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన ఆరోపణలు ఇక్కడ గమనార్హం. కోటి ఆశలతో కొట్లాడి సాధించు కున్న స్వరాష్ట్రం తెలంగాణలో సమస్యలు పెరుగు తున్నాయే తప్ప తగ్గడం లేదు. గతంలో మాదరిగానే ప్రస్తుత పాలకుల తీరు నడుస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా బాధ్యత గల పాలకులు కానరావడం లేదు. ఎటుచూసినా అవినీతి, దోపిడీ సాగుతోంది. వనరులు,సంపదను దోచుకోవడంతో పాటు, వారసత్వ

పాలనకు గట్టిగా బీజాలు వేస్తూ పోతున్నారు. బడుగులను అణచివేస్తూ మన ముఖ్యమంత్రి దొరల పాలన చేస్తున్నారన్న విమర్శలకు ..కాదు లేదు..అన్న సమాధానం రావడం లేదు. ఎన్నికల్లో గెలవడం అన్నది ప్రజలను ఆదుకుని పనిచేయడానికి అన్నది మరచిన పాలకులు పదవులను ఎంజాయ్ చేస్తూ..వ్యాపార దృక్పథంతో పాలన సాగించడం దారుణం కాక మరోటి కాదు. ప్రజల కష్టాలను తీర్చేందుకు చిత్తశుద్ది లేకపోవడంతోనేఇలాంటి దుస్థితి ఏర్పడింది. నగరంలో ఆక్రమణలు తొలగించి..సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను రూపొందిస్తామని ప్రకటించిన నాటి హామీలు పూర్తిగా విస్మరించారు. దశాబ్దాల దరిద్రం అంటున్న మంత్రులు..ఆరేళ్లుగా ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పలేరు. ఆక్రమణల తొలగింపులో, వరద నియంత్రణ చర్యల్లో వైఫల్యం మొన్నటి వరదలతో కొట్టొచ్చినట్లుగా కనిపించింది. చెరువుల విస్తరణ, నీటి నిర్వహణలో ఆటంకాల తొలగింపు, నాలాలపై ఆక్రమణలు, కబ్జాల తొలగింపు ద్వారా ఈ దుస్థితిని నివారించే అవకాశ మున్నా, అందుకు నిపుణుల కమిటీలు నివేదికలిచ్చినా తమవారి ప్రయోజనాలు దెబ్బతింటాయనే దురుద్దేశంతో రాష్ట్ర సర్కారు పెడచెవిన పెట్టింది. కరోనా లాక్ డౌన్ సమయంలో పేద, మధ్య తరగతి వర్గాలు ఆదాయం కోల్పోయి ప్రాణ భయంతో ఉన్న దయనీయ స్థితిలో సహాయం చేయాల్సిన ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ లాంటి పథకాలతో వారిన మరింతగా గుల్ల చేసే పథకాలను రచించింది. ఉన్నసమస్యలను తీర్చాల్సింది పోయి.. రెవెన్యూ సంస్కరణల పేరుతో భూములను, ఆస్తి వివాదాలను పెంచే చర్యలు చేపట్టింది. రెవెన్యూ భూసమస్యలు గతంలో ఉన్నవాటిని పరిష్కరిం చండంలో పూర్తిగా విఫలం అయ్యారు. అనుకోని విపత్తులు వచ్చిపడినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద దిక్కుగా ఉండాలి. ప్రజల కష్టాలను తీర్చేందుకు అండగా నిలబడాలి. పక్కా ప్రణాళికతో సహాయ కార్యక్రమాలు చేపట్టాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనికి పూర్తి విరుద్ధంగా నడుస్తోంది. భారీ వర్షాలు, వరదలు వచ్చిన సమయంలో ముందుగా ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలం కావడంతో పాటు, ఆదుకోవడంలోనూ పూర్తి నిర్లక్ష్యం వహించింది. ప్రజలను ఆదుకునే విషయంలోనూ అవినీతికే పెద్దపీట వేసి, ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నారు. హైదరాబాద్ సమస్యలతో పాటు, ఇటీవలి వరదతలో నష్టపోయిన రైతులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పాలి.

# గ్రేటర్ ఎన్నికలకు సన్నద్ధమైన పోలీస్ యంత్రాంగం

**మూడు కమిషనరేట్ల పరిధిలో 150 డివిజన్లు**
**ప్రశాంత ఎన్నికలకు అధికారుల సమీక్ష**
**లైసెన్సుడు తుపాకులు స్వాధీనం చేయాలన్న పోలీసులు**

హైదరాబాద్,నవబంర్18(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. మూడు కమిషనరేట్ల పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ ఉండడంతో ముగ్గురు కమిషనర్లు సమన్వయంతో ముందుకు సాగనున్నారు. ఇప్పటికే వీరంతా తమ పరిధిలోని అధికారులతో సమీక్షించారు.

జీహెచ్ఎంసీ 150 డివిజన్లు.. మూడు పోలీస్ కమిషనరేట్లతో పాటు సంగారెడ్డి జిల్లాకు కూడా విస్తరించి ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇప్పుడు 150 డివిజన్లలోనూ ఎన్నికల సందడి మొదలయ్యింది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 84, సైబరాబాద్‌లో 33, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 30 డివిజన్లు ఉండగా, మూడు డివిజన్లు సంగారెడ్డి జిల్లా లో ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు అన్ని విభాగాలతో సమన్వయం సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇకపోతే హైదరాబాద్‌లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరు సమన్వయంతో పనిచేయాలని నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ పోలీస్ అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో పోలీసు అధికారులతో శాంతిభద్రతలతో పాటు, ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. గతంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి హైదరాబాద్ పోలీసులకు మంచి గుర్తింపు కూడా వచ్చిందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో జరిగే ఎన్నికల సమయాల్లో పోలీసులది కూడా కీలకమైన పాత్ర అని అన్నారు. అందులో రౌడీషీటర్లు, ప్రజల్లో భయాన్ని సృష్టిందుకు యత్నించే సంఘ విద్రోహ శక్తులను అణిచివేయాలన్నారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై ఫోకస్ పెట్టాలని, రౌడీషీటర్లు, ఇతర సంఘ విద్రోహ శక్తులను బైండోవర్ చేయాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులు తమ వద్ద ఉన్న ఆయుధాలను డిపాజిట్ చేయాలని, బ్యాంకు వద్ద పనిచేసే గార్డ్స్‌కు, ప్రస్తుతం షూటింగ్ పోటీల్లో పాల్గొనే వారికి మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసి ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా చేయడంలో అందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన నియమ నిబంధనలకు సంబంధించిన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని, నిబంధనలకు సంబంధించిన వివరాల నోట్‌ను అందరు తమ వద్ద భద్రపర్చుకోవాలని సూచించారు. ఇదిలావుంటే జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని లైసెన్స్ దారులు.. తమ తుపాకులను ఆయా పోలీసు స్టేషన్‌లలో డిపాజిట్ చేయాలని సీపీ మహేశ్ భగవత్ విజ్ఞప్తి చేశారు. ఒక వేళ ఎవరైనా తుపాకులను సరెండర్ చేయకుండా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసు తరఫున ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీపీ మహేశ్ భగవత్ సిబ్బంది, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో జీహెచ్ఎంసీకి సంబంధించిన మొత్తం 30 కార్పొరేట్ వార్డులు ఉన్నాయి. ఈ 30 వార్డులకు 600 ప్రాంతాల్లో దాదాపు 1600 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నామినేషన్‌ల సందర్భంగా ఆయా కార్యాలయాల వద్ద పూర్తి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసి.. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక ఏసీపీ స్థాయి, ఇన్‌స్పెక్టర్‌లను నోడల్ అధికారిగా నియమించి.. ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తామని చెప్పారు. నామినేషన్‌ల సందర్భంగా రద్దీ తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ చెప్పారు.

ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఎవరైనా భయపెట్టినా, ఆందోళనకు గురి చేసినా, వారిని మభ్యపెట్టేందుకు ప్రయత్నించినా, ప్రలోభాలకు గురి చేసేందుకు డబ్బులు పంపిణీ చేస్తున్నా.. ప్రజలు డయల్ 100, రాచకొండ పోలీసు వాట్సాప్ నంబర్-9490617111 సమాచారం అందించాలని కోరారు. ఈ సమాచారం ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయని సీపీ హెచ్చరించారు.

## అంకాపూర్ బయల్దేరిన వాసాలమర్రి వాసులు

యాదాద్రి భువనగిరి,నవంబర్18(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత తీసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రికి మహర్దశ పట్టుకున్నది. ఇప్పటికే ఆదర్శ గ్రామంగా వెలుగొందుతున్న అంకాపూర్ గ్రామాన్ని చూడాలని, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయాలని సీఎం కేసీఆర్ వాసాలమర్రి గ్రామస్తులకు సూచించారు. దీంతో వాసాలమర్రి గ్రామస్తులు బుధవారం ఉదయం అంకాపూర్‌కు బయల్దేరి వెళ్లారు. మంగళవారం యశోద దవాఖాన వైద్య బృందం ఆధ్వర్యంలో వాసాలమర్రిలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెండు వేల మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల విలువ గల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి ఖరీదైన మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి ప్రారంభించగా కలెక్టర్ అనితారా మచంద్రన్, డీఆర్డీఏ మందాడి ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వాసాలమర్రిలో చేపట్టాల్సిన అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తు న్నారని, ఈనెల 20లోగా బ్లూప్రింట్ తయారవుతుందన్నారు. సీఎం ఆదేశాల మేరకు అభివృద్ధి కమిటీలు వేస్తామన్నారు. ఆ తరువాత అభివృద్ధి పనులు మొదలవుతాయని చెప్పారు.

### ఓటు హక్కు

ఓటరన్న మేలుకో మంచి నాయకున్ని ఎన్నుకో
ఆత్మ ప్రబోధానుసారం ఓటును వేసుకో
డబ్బు ,మద్యం తాయిలాలకు ఓటును అమ్మకు
అభివృద్ధి కాముకులనే
ఓటుతో అందలమెక్కినీచుకో
ప్రజాస్వామ్యంలో ఓటు పాశుపతాస్త్రమని తెలుసుకో
అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకో
ఓటు వేయడం నీ బాధ్యతని తెలుసుకో
ఓటే అభివృద్ధికి
గీటురాయని తెలుసుకో



-యాదవరనీ
చంద్రకాంత్ గౌడ్
9441762105

# వేడెక్కుతున్న గ్రేటర్ రాజకీయం

హైదరాబాద్,నవబంర్18(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవ్వడంతో రాజధానిల్లో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. అధికార టీఆర్ఎస్‌కు సమానంగా విపక్షాలు దూకుడు పెంచాయి. కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ సమావేశాలతో కారు పార్టీకి సవాలు విసురుతున్నాయి. గ్రేటర్ ఎన్నికలకు అందరికంటే ముందుగా టీఆర్ఎస్ సిద్ధమైనప్పటికీ.. తామేమీ తక్కువ కాదంటూ కాషాయదళం దూసుకొస్తోంది. ఇప్పటికే తొలి జాబితాను సిద్ధం చేసింది. అయితే దుబ్బాక ఫలితం తరవాత ఇప్పుడు బిజెపి వైపు యువత ఎక్కువ దృష్టి సారించింది. టిక్కెట్లు ఆశిస్తున్న వారు బిజెపి కార్యాలయానికి క్యూ కట్టారు. ఎవరూ ఊహించని విధంగా బీజేపీలో టికెట్‌ల కోసం అభ్యర్థులు ఎగబడుతున్నారు. తమకంటే తమకే సీటు దక్కాలని పోటీపడుతున్నారు. మొదటి జాబితా ప్రకటించముందే తమకు టికెట్ ఇవ్వాలంటూ నేతలను కలుస్తున్నారు. మరోవైపు బిజెపి పరిశీలకుడు రాజేంద్ర యాదవ్ హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన పార్టీనేతలు లక్ష్మణ్, బండి సంజయ్, వివేక్ తదితరులతో భేటీ అయ్యారు. మ్యానిఫెస్టో సమా ప్రచార వ్యూహంపై చర్చించారు. దుబ్బాక విజయంతో దూకుడుగా ఉన్న బీజేపీ గ్రేటర్‌పై కాషాయం జెండా ఎగుర వేయాలని పట్టుదలతో సన్నాహాలు చేపట్టింది. ఎన్నికలను ఎదుర్కొనేందుకు అధిష్ఠానం పావులు కదుపుతూ అగ్రనాయకులతో కమిటీలు వేసింది. దీంతో ఈ ఎన్నికలను బీజేపీ ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందో స్పష్టమవుతోంది. ఒక వైపు అగ్రనాయకులతో వ్యూహరచన చేస్తునే, మరో వైపు ఆశావహుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.ఎన్నికలను ఎదుర్కొనేందుకు బీజేపీ గ్రేటర్‌ను ఆరు జిల్లాలుగా విభజించింది. నగరంలో నాలుగు, శివారు ప్రాంతాలను రెండు జిల్లాలుగా ఏర్పాటు చేసి, అధ్యక్షులను నియమించింది. పార్టీని పటిష్టం చేయడంతో పాటు ఇతర బాధ్యతలను ఎక్కడికక్కడ స్థానిక నాయకత్వానికి అప్పగించింది. అలాగే, ఆయా జిల్లాల అధ్యక్షులకు కార్పొరేటర్ ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకునే బాధ్యతనూ తాజాగా అప్పగించింది.

## బిజెపిలో ఆశావహుల సందడి
## పార్టీ నేతలతో పరిశీలకుడి మంతనాలు

గ్రేటర్‌లో బీజేపీ తరఫున ఆశావహులు పోటీ పడుతున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఒక్కో డివిజన్ నుంచి నలుగురి నుంచి పన్నెండు మంది వరకు ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేసి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఆయా జిల్లాల్లో అధ్యక్షుడి స్థాయిలోనే కొంతమేరకు ఫిల్టర్ చేసి, ముఖ్యమైన ఆశావహుల జాబితాను రాష్ట్ర పార్టీకి అందించనున్నారు. డివిజన్‌కు ఇద్దరి నుంచి నలుగురు ఆశావహుల పేర్లను అందించేందుకు ఆయా జిల్లాల అధ్యక్షులు కసరత్తు చేస్తున్నారు. అత్యధికులు పోటీ పడిన జిల్లాల్లో ముఖ్యమైన ఐదు, ఆరుగురి పేర్లతో జాబితాను పంపించే యోచనలో అధ్యక్షులు ఉన్నట్లు సమాచారం.

# గ్రేటర్ అభివృద్ధికి కారుకే ఓటేయండి
**-వీడియో సందేశం విడుదల చేసిన ఎమ్మెల్సీ కవిత**

హైదరాబాద్,నవబంర్18(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆరేండ్లలో హైదరాబాద్ ఎంతో పురోగతి సాధించిందని, దాన్ని కొనసాగించేందుకు త్వరలో జరుగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో అభివృద్ధి ఆగవద్దనుకుంటే టీఆర్ఎస్ గెలవాలన్నారు. గ్రేటర్ ఎన్నికల సందర్భంగా కవిత ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ మహానగరంలో రోడ్లు, ÷÷–ల ఓవర్లు, అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించే పరిస్థితులు, 24 గంటల కరెంటు, శాంతిభద్రతలు.. ఇవన్నీ సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ కారణంగానే ఇంత గొప్పగా ఉన్నాయన్నారు.

ఈ నాయకత్వాన్ని ఇలాగే కొనసాగించే బాధ్యత హైదరాబాద్ ప్రజలపై ఉందన్నారు. నగరం వరుసగా ఐదేండ్లుగా ఇండియాలో బెస్ట్ సిటీగా ఉందని మర్సర్ వంటి ఇంటర్నేషనల్ ఏజెన్సీలు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి ర్యాంకులు, గొప్ప పరిస్థితులు కేవలం మాటలతో రావని.. ఎంతో కష్టపడితే మాత్రమే సాధ్యమవుతాయన్నారు. ఇదే అభివృద్ధిని కొనసాగించేందుకు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నేటినుంచి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ పునఃప్రారంభం

తిరుపతి,నవంబర్18(ఆర్ఎన్ఎ): ఈనెల 19నుంచి తిరుపతి చెన్నై సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైలు పున:ప్రారంభం కానుంది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దాదాపు 8 నెలల తర్వాత పట్టాలు ఎక్కనున్న సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైలులోకి ముందస్తుగా రిజర్వేషన్ చేసుకున్న వారినే రైల్వే శాఖ అనుమతించనుంది. సప్తగిరి ఎక్స్ ప్రెస్ రోజూ ఉదయం 6:25 గంటలకు చెన్నైలో బయలుదేరి 9:40 గంటలకు తిరుపతికి చేరుకుని, తిరిగి తిరుపతిలో 10:15 గంటలకు చెన్నైకి బయలుదేరనుంది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com